
కుర్చీలు వదలరా..?

ఓ ఫార్మాసిస్టు గత 35 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇకనైనా కర్నూలుకు రావాలనే ఆశతో బదిలీలకు ఆప్షన్ పెట్టుకున్నారు. కానీ కర్నూలు జీజీహెచ్, రీజనల్ ఐ-హాస్పిటల్స్‌లో పాతిక, ముప్పై ఏళ్లుగా తిష్ఠ వేసినవాళ్లు కదిలేలా లేరు. పైగా గుర్తింపు పొందిన యూనియన్ల సిఫారసు లెటర్ తెచ్చుకున్నారు. దీంతో దరఖాస్తు చేసుకున్న పల్లెటూరి ఫార్మాసిస్టుకు దిక్కుతోచడం లేదు. కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసులో గత 16 ఏళ్లుగా ఓ మినిస్టీరియల్ స్టాఫ్ తిష్ఠ వేశారు. మరో ఉద్యోగి 14 ఏళ్లుగా కుర్చీ కదలడం లేదు.



- 32 ఏళ్లుగా ఒకే చోట తిష్ఠ
- 27 ఏళ్లుగా కర్నూలులో
- వైద్య ఆరోగ్యశాఖ, కర్నూలు జీజీహెచ్‌లో సీట్లు మారని ఉద్యోగులు
- బదిలీలకు రెండు రోజులే

కర్నూలు హాస్పిటల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లో ఓ సీనియర్ అసిస్టెంట్ 16 ఏళ్ల తిష్ఠ వేశారు. అందులోనూ 10 ఏళ్లుగా ఆదాయం వచ్చే సీటులో కొనసాగుతున్నారు. ఈసారి కూడా ఆ ఉద్యోగికి ఓ యూనియన్ సిఫారసు లేఖ ఇచ్చింది. మెడికల్ గ్రౌండ్స్ కింద ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే మరో అధికారి కూడా జోనల్ క్యాడర్‌లో లాంగ్ స్టాండింగ్ ఉన్నారు. ఆ అధికారికి కూడా సిఫారసు లేఖ ఉంది. ఇంకా ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు.

వైద్య ఆరోగ్య, కర్నూలు బోధనాసుపత్రి, రీజినల్ ఐ-హాస్పిటల్‌లో కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి పాతుకుపోయాయి. కొందరు సిల్వర్ జూబ్లీ వేడుకలు పూర్తి చేసుకున్నారు. మరికొందరు 32 ఏళ్లుగా ఉన్నారు. కీలకమైన కర్నూలు జీజీహెచ్, డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో 16 ఏళ్ల దాటినా కదలడానికి ససేమిరా అంటున్నారు. ఈసారి సాధారణ బదిలీల్లో అన్ని సర్వీసులు కలుపుకుని 9 సంవత్సరాలు పూర్తయిన ఉద్యోగులు, ఆఫీస్ బేరర్లను కూడా బదిలీ చేయాలని వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. అదే సీనియర్ అసిస్టెంట్లకు 3 సంవత్సరాలు పూర్తయితే బదిలీ చేయాల్సిందే. అయితే ఈ ప్రభుత్వ నిబంధనలను వైద్యఆరోగ్యశాఖలో కొంతమంది ఉద్యోగులు, అధికారులు తుంగలో తొక్కుతున్నారు. ఏళ్ల తరబడి గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగులు ఈసారైనా కర్నూలుకు రావాలని ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే నగరంలో పాతుకుపోయిన ఉద్యోగులు మాత్రం కుర్చీలు వదలడానికి సిద్ధంగా లేరు. దీని కోసం అడ్డదారులు తొక్కుతున్నారు ఎలాగైనా అక్కడే తిష్ఠ వేయాలని ఎత్తుగడలు పన్నుతున్నారు. కొందరు రాత్రికి రాత్రి ఆఫీస్ బేరర్లుగా నియామక పత్రాలతో బదిలీ కాకుండా చూస్తున్నారు. జిల్లాలో ఇవ్వకుంటే రాష్ట్ర నాయకుల వద్ద నుంచి సిఫారసు లేఖలను తెచ్చుకుంటున్నారు.



కర్నూలు డీఎంహెచ్‌వో కార్యాలయం

వైద్యఆరోగ్య శాఖలో ఉద్యోగులు, వైద్యుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 19వ తేదీలోపు బదిలీలు పూర్తి చేసి 23వ తేదీ విధుల్లో చేరాలని ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని డీఎంహెచ్‌వో, జీజీహెచ్ సూపరింటెండెంట్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, రీజినల్ ఐ-హాస్పిటల్ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కొందరు ఉద్యోగులపై అవినీతి, అక్రమాలపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీన్ని అరికట్టడానికి వైద్యఆరోగ్య శాఖ కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇతర శాఖల మాదిరిగా కాకుండా బదిలీ నిబంధనలను వైద్య ఆరోగ్యశాఖ కోసం సడలించారు. ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన పాలక సిబ్బందిని బదిలీ చేయాలని నిర్ణయించింది.

మిగతా 6వ పేజీలో

అర్జీలను పరిష్కరించండి

కలెక్టర్ రంజిత్ బాషా


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అర్జీలను నాణ్యంగా పరిష్కరించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.

17న పారిశుధ్య కార్మికులతో యోగా

థీమాటిక్ యోగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న కర్నూలు నగరంలోని అవుట్ డోర్ స్టేడియంలో పారిశుధ్య కార్మికులతో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది కూడా హాజరు కావాలని ఆదేశించారు. జూన్ 21వ తేదీ ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా రాష్ట్రంలో జరిగే కార్యక్రమంలో 2 కోట్ల మంది ప్రజలు పాల్గొంటున్నారని, ఇందులో కర్నూలు జిల్లా నుంచి దాదాపు 11 లక్షల మంది పాల్గొనేలా రిజిస్ట్రేషన్ చేయించామని అన్నారు. జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

బియ్యం దొంగలు ఎవరు..?


ఈనెల 13న అర్ధరాత్రి గోదాముకు వేసిన తాళం ఈనెల 14న ఉదయం తెరుస్తున్న ఆదోని డిప్యూటీ తహసీల్దారు బాబు

7

కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరాలయం

శ్రీశైలానికి కొనసాగుతున్న వరదజలాలు

కొత్తపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్రలలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు వరదజలాలు వచ్చి చేరుతుండటంతో నదీ గర్భంలో ఉన్న సప్తనదుల సంగమేశ్వరాలం కృష్ణా నది ఒడిలోకి చేరుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులకు గాను 842.40 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 215 టీఎంసీలకుగాను 65.457 టీఎంసీలుగా నమోదైంది. సంగమేశ్వరాలయం జలాధివాసం అవుతున్న అద్భుత దృశ్యాన్ని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. ఎగువ ఉమామహేశ్వరాలయంలోని స్వామివారిని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


కృష్ణమ్మ ఒడిలో చేరుతున్న సంగమేశ్వరాలయం

రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

ప్రహ్లాదజోషికి స్వాగతం పలికిన ఎంపీ, కలెక్టర్, ఎస్పీ

మంత్రాలయం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కేంద్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాదజోషి కుటుంబ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. అలాగే కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి మంత్రాలయానికి చేరుకుని పద్మనాభతీర్థ అతిథి గృహంలో బస చేసిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం ఆలయ ముఖద్వారం వద్ద మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషీ సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని హారతులు ఇచ్చారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేసి ప్రహ్లాదరాయల పాదపూజలో పాల్గొని తరించారు. సాయంత్రం కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ కేంద్ర మంత్రికి పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. రాత్రి రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, పట్టువస్త్రం ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి కేంద్రమంత్రిని సత్కరించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, సభ్యుడు నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, రాయచూర్ కలెక్టర్ నితీశ్, ఎస్పీ పుట్ట మాదయ్య, ట్రాన్స్‌కో సీఎండీ సంతోష్‌రావు, ఎస్ఈ ఉమాపతి, డీఈ పురుషోత్తం, ఏఈ గోవిందు, జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రాజగోపాల్, టీడీపీ నాయకులు మద్దిలేటి, చంద్రశేఖర్, కేంద్ర ఇండిపెండెంట్ డైరెక్టర్ గిరీష్ ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రవి, నార్త్ జోన్ శ్రీమఠం విచారణకర్త శ్రీనివాస కస్బే ఉన్నారు.


శ్రీమఠంలో ప్రదక్షిణ చేస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి, ఎంపీ బస్తిపాటి నాగరాజు

జంబో ప్లాట్ ఫారానికి మోక్షమెన్నడో?

- మార్కెట్‌యార్డులో అసంపూర్తిగా నిర్మాణం
- ముందుకు రాని కాంట్రాక్టర్లు


అసంపూర్తిగా మిగిలిపోయిన ప్లాట్ ఫారం

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మార్కెట్ కమిటీల పరిధిలో గోదాములు, ప్లాట్‌ఫారాలు తదితర పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు పరుగులు పెట్టేవారు. ఎక్కువ లాభాలు వస్తాయని ఇంజనీరింగ్ అధికారులు చూసీ చూడనట్లు తమను లాభాలబాట పట్టిస్తారని వారు అనుకునేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లు మార్కెట్ కమిటీల పరిధిలోని పనులు చేసేందుకు వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం కర్నూలు మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో జంబో ప్లాట్ ఫారం పనులను గత వైసీపీ పాలనలో చేపట్టారు. దాదాపు పనులన్నీ పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు ఇంకా రూ.1.75 కోటి దాకా బకాయిలు రావాల్సి ఉంది. చిన్నపాటి వర్షం వచ్చినా ఆ నీళ్లన్నీ జంబో ప్లాట్‌ఫారంలో నిల్వ చేసిన రైతుల పంట ఉత్పత్తులు తడిసిపోయి తీవ్ర నష్టానికి గురవుతున్నారు. ఈ పనులు వెంటనే పూర్తి చేయాలని మార్కెట్ కమిటీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారి రఘునందన్‌రెడ్డిపై ఒత్తిడి వస్తోంది. దీంతో రెండు రోజుల క్రితం డీఈ రఘునందన్ రెడ్డి కాంట్రాక్టరును అసంపూర్తి పనులు వెంటనే చేయాలని ఎట్టి పరిస్థితుల్లోనూ చేసిన పనులకు బిల్లులు వెంటనే వచ్చేలా చేస్తానని బతిమిలాడుకున్నారు. తమకు ఇప్పటి దాకా చేసిన పనికి సంబంధించి బిల్లులు ఇప్పిస్తేనే పనులు చేస్తామని ఆ కాంట్రాక్టరు మెలిక పెట్టడంతో ఆ ఇంజనీరింగ్ అధికారి దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. ఒకప్పుడు ఎస్టిమేట్ ధర కంటే లెస్సుకు టెండరు వేసి పనులు దక్కించుకునే కాంట్రాక్టర్లు ప్రస్తుతం ఎక్సెస్ రేటుకు టెండరు దక్కేలా అవకాశం దక్కిస్తామని ఇంజనీరింగ్ అధికారులు వేడుకుంటున్నా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అధికారులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు.

న్యాయం చేస్తాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 93 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయి.

ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు హాస్పిటల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటల్స్, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీలకు సంబంధించిన 10 కేటగిరి ఉద్యోగాలకు సంబంధించిన అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టు, సెలెక్షన్ లిస్టును విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. సెలక్షన్ లిస్టులను కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్, కర్నూలు మెడికల్ కాలేజీ వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేసినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను, రెండు సెట్ల నకలు సర్టిఫికెట్లతో ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. హాజరుకాని అభ్యర్థుల ఎంపికను రద్దు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు


స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. సోమవారం జ్యేష్ఠ పంచమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. మఠం పీఠాధిపతి వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

జిల్లాలో 5,763 మంది ఉపాధ్యాయుల బదిలీ

- 944 మందికి పదోన్నతులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ కడప పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పని చేస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పదోన్నతులతో పాటు బదిలీలు జరిగాయి. గ్రేడ్-2 హెచ్‌ఎంలు 134 మంది, మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు 406, ఎస్‌ఏలు, తత్సమానమైన కేటగిరీలో 2,788 మంది, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 2273 మంది, భాషా పండితులు 119 మంది, పీఈటీలు 32 మంది, ఆర్ట్ క్రాఫ్ట్, మ్యూజిక్ ఇతర ఉపాధ్యాయులు 11 మంది కలిపి మొత్తం 5,763 మంది బదిలీ అయినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ తెలిపారు. అలాగే గ్రేడ్-2 హెచ్‌ఎంలు 141 మంది, ఎస్‌ఏలు(నాన్ లాంగ్వేజ్) 169 మంది, ఎస్‌ఏలు(లాంగ్వేజ్) 12 మంది, ఎస్‌ఏలు(ఫిజికల్ ఎడ్యుకేషన్) 8మంది, ప్రైమరీ స్కూల్స్ హెచ్‌ఎంలు 614 మంది మొత్తం 944 మంది పదోన్నతులు పొందినట్లు ఆయన తెలిపారు. పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన స్థానాల్లో చేరినట్లు డీఈవో తెలిపారు.

కుర్చీలు వదలరా...?



5వ పేజీ తరువాయి

అన్ని సర్వీసులను కలుపుకుని తొమ్మిదేళ్లు దాటిన వారు, ఆఫీస్ బేరర్లు అయిన వారు, మెడికల్ సర్టిఫికెట్ ఉన్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆదేశించింది. అయితే క్యాష్, పలుకుబడి, కులాల ఆధారంగా కొందరిని సంఘాల్లో ఆఫీస్ బేరర్స్‌గా చేర్చుకుని సిఫార్సు లేఖలు అందజేసినట్లు సమాచారం. ఇటీవల ఓ ఉద్యోగ సంఘానికి ప్రభుత్వం గుర్తింపును తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో సంఘం నుంచి సిఫారుసు లేఖల కోసం డబ్బులు ఇచ్చిన వాళ్లు ఆందోళన పడుతున్నారు. ఆ సంఘం నుంచి వచ్చే సిఫారసు లేఖలు పక్కన పెట్టాలని ఆదేశాలు రావడంతో ఉద్యోగులు ఖంగుతిన్నారు. ఇచ్చిన డబ్బుల కోసం నాయకుల వద్దకు పరుగులు పెడుతున్నారు.

● **జోనల్‌లో అధికంగా సిఫారసు లేఖలు:** వైద్యఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ) కార్యాలయానికి గుర్తింపు పొందిన సంఘాల సిఫారసు లేఖలు ఎక్కువగా ఉన్నాయి. కడప జోన్-4 క్యాడర్లలో ఏపీ ఎన్జీవో 76 మంది, ఏపీజీఈఏ సంఘం 76 మంది, ఏపీ హంస 68 మంది, ఐఎన్‌టీయూసీ సంఘం 8 మంది, ఏపీ నర్సింగ్ అసోసియేషన్ ఆరుగురికి సిఫారసు లేఖలు ఇచ్చాయి. . ఇందులో కీలకమైన సీనియర్ అసిస్టెంట్లు ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో సంఘం 19 మందికి అత్యధికంగా ఇచ్చింది. . ఏపీజీఈఏ సంఘం ఏడుగురు 7 మంది ఏపీ హంస సంఘం 14 మంది, ఐఎన్‌టీయూసీ సంఘం ఒక్కరికి ఇచ్చారు. ఎంపీహెచ్ఎస్ ఉద్యోగులకు ఏపీఎన్‌జీవో 10 మంది, ఏపీజీఈఏ-11, హంస-4, ఎంపీహెచ్ఈవో క్యాడర్లలో ఏపీఎన్జీవో-15 మంది, ఏపీజీఈఏ-18, హంస-5, ఎంపీహెచ్ఎస్ఎం క్యాడర్లలో ఏపీఎన్జీవో-22, ఏపీజీఈఏ-18, ఏపీ హంస-15 మందికి సిఫారసు లేఖలు ఇచ్చారు.

ఏళ్లుగా తిష్ఠ వేసిన ఉద్యోగులు

- ఓ ఫార్మసీ ఆఫీసర్ రీజినల్ ఐ-హాస్పిటల్, 31 సంవత్సరాలుగా ఒకే చోట పని చేస్తున్నారు. కడప జోనల్ క్యాడల్‌లో ఫార్మసీ ఆఫీసర్ లాంగ్ స్టాండింగ్‌లో మొట్టమొదటి పేరు ఇదే ఉండటం విశేషం.
- కర్నూలు జీజీహెచ్‌లో ఓ ఫార్మసీ ఆఫీసర్ 27 సంవత్సరాలుగా ఇక్కడే పని చేస్తున్నారు. లాంగ్ స్టాండింగ్‌లో రెండో స్థానంలో ఉన్నారు.
- కర్నూలు జీజీహెచ్ పరిపాలన విభాగంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి 18 సంవత్సరాలుగా తిష్ఠ వేశారు. ఆయన జోనల్ క్యాడల్ లాంగ్ స్టాండింగ్ లిస్టులో మొదటి స్థానంలో ఉన్నారు.
- కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసులో ఓ ఉద్యోగి 16 సంవత్సరాలుగా ఇక్కడే పని చేస్తున్నారు. ఆ ఉద్యోగి జోనల్‌లో లాంగ్ స్టాండింగ్‌లో మూడో స్థానంలో ఉన్నారు.
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఓ ఉద్యోగి 15 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. గత 10 సంవత్సరాలుగా ఒకే సీటులో విధులు నిర్వహించడం విశేషం. ఆ ఉద్యోగి లాంగ్ స్టాండింగ్ జోనల్‌లో 5వ స్థానంలో ఉన్నారు.
- కర్నూలు జీజీహెచ్‌లో పని చేస్తున్న ఓ స్టాఫ్ నర్సు అత్యధికంగా 16 సంవత్సరాలుగా ఇక్కడే పని చేస్తున్నారు. లాంగ్ స్టాండింగ్ స్టాఫ్ నర్సుల జోనల్ లిస్టులో 2వ స్థానంలో ఉన్నారు.
- కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఓ స్టాఫ్ నర్సు 14 సంవత్సరాలుగా పని చేస్తున్నారు.
- కర్నూలు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గత 14 సంవత్సరాలుగా ఇక్కడే ఉన్నారు.

ఇది చాలా అన్యాయం



గుర్తింపు పొందిన అసోసియేషన్లు రోసా నిబంధనలకు విరుద్ధంగా బైలాకు వ్యతిరేకంగా ఆఫీస్ బేరర్ల సర్టిఫికెట్లు కేటాయించడం నేరం. ఈ విషయాన్ని గుర్తింపు పొందిన సంఘాలు ఆలోచించుకోవాలి. లేదంటే భవిష్యత్తులో ఉద్యోగులే తిరగబడే అవకాశం ఉంటుంది. సీహెచ్‌వో రాష్ట్ర క్యాడల్‌లో 68 మంది లాంగ్ స్టాండింగ్ ఉండగా.. ఇందులో 65 మందికి ఆఫీస్ బేరర్ల సర్టిఫికెట్లు ఉండటం పరిస్థితికి అద్దం పడుతుంది. సిఫారసు లేఖలు ఉన్న వారు ఏళ్లుగా సిటీలోనే తిష్ఠ వేశారు. ఇది అన్యాయం.

-ఎం.నాగరాజు, ఏపీ తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

యంత్ర సేవల్లేవు



చాగలమర్రిలో అద్దె భవనంలో ఆర్ఎస్‌కే కేంద్రం

- చాలా వరకు మూలన పడ్డ కియోస్కో యంత్రాలు
- కర్నూలు జిల్లాలో 466, నంద్యాల జిల్లాలో 411 ఏర్పాటు
- ఒక్కో యంత్రానికి సుమారు రూ.80వేలు
- వైసీపీ ప్రభుత్వ అసమర్థతతో కోట్ల నిధులు దుర్వినియోగం
- వినియోగంపై అన్నదాతలకు కల్పించని అవగాహన
- సెల్‌ఫోన్లతోనే రైతులకు సమాచారం

చాగలమర్రి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సాగుదారులు రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు వీలుగా కోట్లు ఖర్చు చేసి ఏర్పాటుచేసిన కియోస్కో యంత్ర సేవలు అందడం లేదు. ఆ యంత్రాలు రెండేళ్లకే మూలకు పడ్డాయి. ప్రారంభంలో యంత్రాల ద్వార అరకొర సేవలు అందించిన కొద్దిమంది మాత్రమే ఎరువులు, పురుగు మందులు, యంత్రాల ద్వారా కొనుగోలు చేశారు. ప్రస్తుతం రైతుభరోసా కేంద్రాల్లోని యంత్రాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అధికారులు, సిబ్బందితో సంబంధం లేకుండా రైతులే ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)కు వచ్చి స్వయంగా తమకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను అవసరమైన పరిమాణంలో కియోస్కో యంత్రాల ద్వార నమోదు చేసుకోవచ్చు. తరువాత నేరుగా రైతుల ఇంటికే వాటిని సరఫరా చేస్తారు. అన్నదాతలకు వీటిపై అవగాహన కల్పించక పోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరుపయోగంగా మారాయి. ఒక్కో యంత్రానికి రూ.80 వేలు దాక ఖర్చు చేశారు. మొదటి ఏడాదిలో నామమాత్రంగా పనిచేశాయి. 2023 నుంచి యం త్రాల వినియోగం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో కియో స్కో యంత్రాల ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు.

ఉమ్మడి జిల్లాలో 877 రైతు భరోసా కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో రైతులకు సేవలు అందించడానికి 877 రైతు సేవా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి కేంద్రానికి రూ.80వేల విలువైన కియోస్కో యంత్రం ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 466, నంద్యాల జిల్లాలో 411 కియోస్కో యంత్రాలను ఇచ్చారు. వివిధ సమస్యలతో 180 యంత్రాలు పని చేయడం లేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కియోస్కో యంత్రాలు పని చేస్తే వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. అక్రమాలు చేయడానికి వీలు ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని కొందరు సిబ్బంది సాంకేతిక ఇబ్బందులు తదితర కారణాలతో కియోస్కోల వాడకాన్ని తగ్గించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎరువుల అమ్మకానికి సంబంధించి రూ.48 లక్షల వరకు బకాయిలను వ్యవసాయ సిబ్బంది చెల్లించాల్సి ఉంది. సీజన్‌లో ఎరువుల అమ్మకాలు జరుగుతున్నప్పుడే వ్యవసాయాధికారులు పర్యవేక్షణ చేస్తే సిబ్బంది ఎప్పటికప్పుడు నగదు చెల్లింపులు చేస్తారు. రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేసిన క్రమంలో నాన్‌సబ్సిడీ చెల్లింపులకు సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాలో రూ.10 లక్షల వరకు ఏపీ సీడ్స్‌కు బకాయిలు ఉన్నట్లు సమాచారం. రైతులు చెల్లించిన మొత్తాన్ని కొందరు వ్యవసాయ సిబ్బంది తమ సొంతానికి వాడుకున్నట్లు సమాచారం.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రస్తుతం అన్ని సేవలు సెల్‌ఫోన్లలోనే అందిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాలు పని చేయకపోవడం వాస్తవం. బయోమెట్రిక్ విధానం లేక పోవడంతో సెల్‌ఫోన్ ద్వారానే వినియోగిస్తున్నాం. కియోస్కోల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

● రంగనేతాజీ, ఏవో, చాగలమర్రి

మూలనపడ్డ యంత్రాలు

ఖరీఫ్, రబీలో కియోస్కో యంత్రాల ద్వార విత్తనాలు, ఎరువుల, పురుగుమందులు ఇస్తుంటారు. యంత్రాలు పనిచేయకపోవడంతో సుమారు 70 శాతం మంది రైతులు ప్రైవేటు వ్యాపారుల నుంచి విత్తనాలు, ఎరువులు తెచ్చి సాగు చేసుకుంటున్నారు. ఆయా కేంద్రాల్లో కియోస్కో యంత్రాలు మూలకు చేరాయి.

సెల్‌ఫోన్‌లోనే సేవలు

ప్రస్తుతం గ్రామ స్థాయిలో పనిచేసే వీఏఏలు, ఎంపీఈవోలు, వీహెచ్ఏలు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, యంత్రాలు, యంత్ర పరికరాలు, ఈ-పంట నమోదు తదితర విషయాలు సెల్‌ఫోన్‌లోనే నమోదు చేస్తున్నారు. వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు తదితర సేవలన్ని సెల్‌ఫోన్‌లోనే తెలుసుకునే అవకాశం ఉంది. దీంతో లక్షలాది రూపాయలు విలువ చేసే కియోస్కోలు మూలకు చేరాయి. యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.

రైతులకు శుభవార్త

- బయోమెట్రిక్ అవసరం లేదు.. ఆధార్ ఓటీపీతోనే ఈకేవైసీ
- అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల లబ్ధిదారుల హర్షం
- ఉమ్మడి జిల్లాలో ఈకేవైసీ పూర్తికాని అన్నదాతల సంఖ్య 10,604

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకాలకు రైతులకు బయోమెట్రిక్ అవసరం లేదని ఈ ఏడాది ఈకేవైసీయే పూర్తిచేయాలని అధికారులకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌యోజన కింద ఇప్పటికే లబ్ధిదారులను గుర్తించారు. ఇటీవల అన్నదాత సుఖీభవకు రైతుల నుంచి బయోమెట్రిక్ తప్పనిసరి అంటూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ఇప్పటికే ఈకేవైసీ 95శాతం పూర్తయ్యింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో సమయం లేదని, రైతులను ఏ మాత్రం ఇబ్బందులకు గురిచేయవద్దంటూ మరో రెండు రోజుల్లో ఈకేవైసీ వందశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలతో బయోమెట్రిక్ విధానాన్ని నిలిపివేసి ఈకేవైసీ పూర్తి చేయని రైతులపై దృష్టిసారించారు. త్వరితగతిన ఆధార్ ఓటీపీ ద్వారా ఈకేవైసీ పూర్తిచేయాలని గ్రామస్థాయిలో వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. అర్హులైన ప్రతి రైతుకు ఈనెల 20వతేదీన విడుదల చేయబోయే సహాయం వారి ఖాతాలో జమకావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది.

ఉమ్మడి జిల్లాలో పూర్తికాని ఈకేవైసీ ప్రక్రియ

ఉమ్మడి జిల్లాలో 10,604 మంది రైతులు ఇంకా ఈకేవైసీ పూర్తి చేయలేదు. కర్నూలు జిల్లాలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకానికి 2,55,265 మంది లబ్ధిదారులను గుర్తించగా 2,49,251 మంది రైతులు ఈకేవైసీ పూర్తిచేశారు. 6014 మంది రైతులు ఈకేవైసీ చేయాల్సి ఉంది. నంద్యాల జిల్లాలో 1,85,297 మంది లబ్ధిదారులను గుర్తించగా 1,80,707 మంది ఈకేవైసీ పూర్తిచేశారు. 4590 మంది లబ్ధిదారులు పూర్తిచేయాల్సివుంది. మొత్తం రెండు జిల్లాల్లో 10,604 మంది లబ్ధిదారుల ఈకేవైసీ పూర్తిచేసేందుకు అధికారులకు రెండు రోజులు గడువు ఇచ్చారు. దీంతో గ్రామస్థాయిలో ఉండే వ్యవసాయాధికారులు వందశాతం ఈకేవైసీ పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు. రెండురోజుల్లో లబ్ధిదారుల అభ్యంతరాలపై గ్రామ రైతు సేవాకేంద్రాల్లో జాబితాను ప్రదర్శించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఈకేవైసీతోనే ప్రభుత్వ ప్రోత్సాహకాలు



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌యోజన పథకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను ఈకేవైసీతోనే ఈ ఏడాది పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం సిబ్బందిని పూర్తిస్థాయిలో రైతులందరికీ ఈకేవైసీ చేసేవిధంగా అప్రమత్తం చేశాం. జిల్లాలో సుమారు 95 నుంచి 97శాతం ఈకేవైసీ పూర్తయ్యింది. మిగిలిన రైతులందరితో ఈకేవైసీ పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి బయోమెట్రిక్ అవసరం లేదు.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

తల్లుల ఆనందం...

- పిల్లలకు పుస్తకాలు, బ్యాగుల కొనుగోలు
- కిటకిటలాడిన పోస్టాఫీసు



పోస్టాఫీసులో తల్లికి వందనం డబ్బులు తీసుకుంటున్న మహిళలు

కర్నూలు న్యూసిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనం పథకం ప్రకారం తల్లుల ఖాతాల్లో నగదును జమ చేసింది. ఇంట్లో చదువుతున్న పిల్లలందరికీ తల్లులు బ్యాంకు ఖాతాలో, పోస్టాఫీసు ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేసింది. సోమవారం ప్రధాన తపాలా కార్యాలయంలో తమ ఖాతాల్లో జమ అయిన నగదును డ్రా చేసుకునేందుకు మహిళలు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. దీంతో పోస్టాఫీసు సిబ్బందికి వారిని నియంత్రించేందుకు శ్రమించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆనందంగా నగదు డ్రా చేసుకొని పోస్టాఫీసు సమీపంలోని దుకాణాలలో తమ పిల్లలకు పుస్తకాలు, బ్యాగులను కొనుగోలు చేశారు.



కర్నూలులో పుస్తకాలు, బ్యాగులు కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు



బడి ఘోష

- నన్ను కాపాడండి.. ● విద్యార్థులు లేక, శిథిలమైపోతున్న పాఠశాల ఆవేదన ● కరపత్రం విడుదల చేసిన ఉపాధ్యాయులు



ఎం.అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాల



కరపత్రం విడుదల చేసిన పాఠశాల ఉపాధ్యాయులు

మద్దికెర, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఉజ్వలంగా వెలిగిన బడి, వందలాది పిల్లలతో కళకళలాడిన విద్యాలయం, నేడు బోసిపో యింది. ప్రైవేట్ పాఠశాలల మోజులో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పకపోవడంతో ఈ పాఠశాల వెలవెలపోతోంది.. ఈ దుస్థితిని ఉపాధ్యా యులు బడి ఘోషగా కరపత్రంగా విడుదల చేశారు. అది ఇలా ఉంది...

గౌరవనీయ గ్రామ పెద్దలకు, ప్రజా ప్రతినిధులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు నా విన్నపం. నాడు ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థాయికి ఎదిగేలా చేయూతనిచ్చాను. గతంలో నన్ను గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఎంతో బాగా చూసుకున్నారు. ఊరికి అతిదగ్గరలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన గదులు. పచ్చని చెట్లు, ప్రహరీ, బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన ఉండేది. క్రమంగా నన్ను వదిలేసి మీ పిల్లలను మద్దికెర, గుంతకల్లు మాటూ, బూటూ టై కట్టి అరకొర వసతులు గల ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు పంపుతోంటే నా గుండె బరువెక్కింది. ఆ పిల్లలు అట్లా పోతుంటే చూస్తూ శిలనైపోయాను. నా బిడ్డలు నా దగ్గరకు రాకుండా పోతున్నారనే బాధ.. కానీ ఏమీ చేయలేని దౌర్భాగ్యస్థితి నాది. నేను ఎందరో డాక్టర్లను ఇచ్చాను.. ఇంజనీర్లను ఇచ్చాను.. న్యాయవాదులను కూడా ఇచ్చాను.. ఉపాధ్యాయులను ఇచ్చాను.. ఉపాధ్యాయులు వస్తుంటారు.. బదిలీపై వెళ్తుంటారు.. నన్ను కాపాడుకోవాలని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేటట్లు చూసుకోవాలనే ఆలోచన ఎవరైనా చేస్తున్నారా..? కొన్నేళ్ల తర్వాత నేను కూడా మొండి గోడలతోనే నిలబడిపోతానేమో అనే భయం కలుగుతున్నది. ఇప్పటికైనా మీ బిడ్డలను నా చెంతకు పంపండి.. వారి భవితను తీర్చిదిద్దుతాం. ఆనాటిలాగే నేడూ విద్యార్థులతో కళకళలాడేలా నన్ను చూడాలని కోరుతున్నాను..

గ్రామ ప్రజలందరికీ రెండు చేతులా నమస్కరిస్తున్నాను.. నన్ను కాపాడుకోండి... నేను మీ గ్రామ చదువుల బడిని.. ధన్యవాదాలతో ..

ఇట్లు..
మీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
ఎం.అగ్రహారం, మద్దికెర మండలం.

ఆర్టీసీలో 'సౌర' వెలుగులు

- సోలార్ వినియోగంతో నెలకు రూ. లక్ష ఆదాయం
- అన్ని డిపోలకు ఆదర్శం నంద్యాల
- రాష్ట్రంలోని ఐదు డిపోల్లో ఏర్పాటు



నంద్యాల ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ పలకలు

నంద్యాల టౌన్, జూన్16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని ఆర్టీసీ డిపో అధికారులు సోలార్ విద్యుత్తు వైపు అడుగులు వేశారు. దీంతో నెలకు రూ. లక్ష వరకు నష్టాన్ని తగ్గించుకున్నారు. ఇప్పటికి కొన్ని ఏళ్ల నుంచి సోలార్ విద్యుత్ వాడుతూ ఏడాదికి సుమారుగా రూ.12 లక్షల ఆదాయం చేకూరుస్తున్నారు. రాష్ట్రంలోనే నంద్యాల ఆర్టీసీ డిపో ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 2019లో ఈ సోలార్ ప్రాజెక్టును ప్రారంభించారు. నంద్యాల డిపోతో పాటు కాకినాడ, విజయవాడ, మదనపల్లి, చిత్తూరు జిల్లాల్లోని డిపోల్లో సౌర విద్యుత్‌ను ఏర్పాటుచేశారు. ఇందుకు సావిటర్ సంస్థ వారు ఆర్టీసీ డిపోల్లో ఏర్పాటు చేయించారు. ఇందుకు అయ్యే ఖర్చు సుమారుగా రూ.35 లక్షలైంది. సంస్థ వారు 50శాతం పూర్తిగా సబ్సిడీ ఇచ్చారు. రెండేళ్ల పాటు వారే నిర్వహణ బాధ్యత కూడా తీసుకున్నారు. 2019నుంచి ఇప్పటివరకు ఆర్టీసీ వారు సౌర విద్యుత్తు వాడడం వల్ల ఇప్పటి వరకు సుమారుగా రూ.70లక్షల వరకు మిగిల్చినట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అలాగే సౌర విద్యుత్తు వల్ల ఉత్పత్తి అయిన విద్యుత్తును మిలిగిన వాటిని విద్యుత్తు శాఖ వారికి ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

రోజుకు 400 నుంచి 500 యూనిట్ల వరకు..

నంద్యాల ఆర్టీసీ డిపోలో నెలకు గతంలో కరెంటు బిల్లులు రూ. 2లక్షలు వచ్చేవని అధికారులు చెబుతున్నారు. ఈ భారం భరించలేక సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేశారు. దీంతో రోజుకు 400 యూనిట్ల నుంచి 500 యూనిట్ల వరకు కరెంటు ఉత్పత్తి చేస్తున్నారు. చిత్తూరు, విజయవాడ, మదనపల్లి, కాకినాడ డిపోల్లో కూడా రోజుకు 300 నుంచి 600 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. డిపోల్లో వినియోగం పోగా మిగిలిన విద్యుత్ విద్యుత్ శాఖ వారు కొనుగోలు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. వారు కోనుగోలు చేస్తున్నందుకు తగిన మొత్తాన్ని ఆర్టీసీకి చెల్లిస్తున్నారు.

ఇతర డిపోల్లో ఏర్పాటుకు ప్రణాళికలు

నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూర్, కోవెలకుంట్ల, బనగానపల్లె, బేతంచెర్ల డోన్ వంటి ప్రాంతాల్లో కూడా సోలార్ పలకలు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇదిలా కొనసాగితే చాలావరకు విద్యుత్‌ను ఆదా చేసినట్లు అవుతుంది. ఆర్టీసీ ప్రాంగణంలో కరెంటు కోతలు ఉండవు. సంస్థకు ఆదాయం కూడా సమకూరుతుంది.

సిబ్బందికి ఉపయోగకరం..



ఆర్టీసీలో ఇప్పటివరకు సోలార్ ద్వారా విద్యుత్‌ను ఆదాచేశాం. విద్యుత్ కోతలు లేకుండా గ్యారేజిలో పనులు చేస్తున్నాం. దీంతో సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. అత్యవసర సమయాల్లో చాలా ఉపయోగపడుతుంది. ఇలానే జిల్లాలోని అన్ని డిపోల్లో ఏర్పాటుకు ప్రణాళికలు చేస్తున్నాం.

● రజియా సుల్తానా, ఆర్టీసీ ఆర్ఎం, నంద్యాల

దిగజారుడు రాజకీయాలు చేస్తున్న వైసీపీ

- డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అకెపోగు ప్రభాకర్‌తో కలిసి మాట్లాడారు. వైసీపీ నాయకుడు ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు కొందరు నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబును వెన్ను పోటు దారుడంటూ విమర్శించడం.. వారికి స్థాయికి తగదన్నారు. ఏనాడు జిల్లాల అభివృద్ధి గురించి పట్టించుకోని వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక పోతున్నారని మండి పడ్డారు. జగన్ ఏనాడు ప్రజల గురించి పట్టించుకోలేదని, ఎంత సేపు మైనింగ్, లిక్కర్, ఇసుక, గంజాయి, డ్రగ్స్ వంటి మాఫియాలతో రాష్ట్రాన్ని దోచేసి, ప్రజల నెత్తిన పది లక్షల కోట్ల అప్పు పెట్టారని ఆరోపించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు డి.జేమ్స్, నంద్యాల నాగేంద్ర, నాయకులు జె.తిరుపాల్ బాబు, సత్రం రామక్రిష్ణ, విజయకుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

- ప్రమాణ స్వీకారం విజయవంతం.. నంద్యాలో డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలకు వై.నాగేశ్వర రావు కృతజ్ఞతలు తెలిపారు.

19న అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగే సౌత్‌జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవేందర్‌గౌడు సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఉదయం 10 గంటలకు డీఎస్ఏ స్టేడియంలోని కర్నూలు క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. 1-9-2009 తరువాత 31.8.2011కు ముందు జన్మించిన వారు అండర్ 14 బాలుర జట్టు ఎంపికకు అర్హులన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో ఎంపికకు హాజరు కావాలన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నందవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నందవరం గ్రామానికి చెందిన పొతుగడ్డ పులకుర్తి రాముడు అప్పులబాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కేశవ్ తెలిపారు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. వెంటనే చుట్టు పక్కల వారు గ్రహించి ఆయనను ఎమ్మిగనూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. రాముడు భార్య ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ పుష్పావతి, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యాక్షుడు నాగరాజుగౌడు రైతు మృతికి నివాళి అర్పించారు.



రాముడు (ఫైల్)

వృద్ధుడి మృతి

పగిడ్యాల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలో పాలమర్రికి చెందిన నాగశేషులు(68) అనే వృద్ధుడు సోమవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ సుబ్బరావు తెలిపారు. పాలమర్రికి చెందిన నాగశేషులు 30 ఏళ్లకు పైగా గడివేములలోని హోటల్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో ఎవరూ లేనప్పటికీ ఏడాది ఒకసారి ఇక్కడికి వచ్చి వెళ్తుండేవాడని తెలిపారు. గత రెండు రోజుల కిందట గ్రామానికి వచ్చిన నాగశేషులు బస్టాండ్‌లో ఉన్నాడు. ప్రమాదవశాత్తు రాత్రి కింద పడటంతో మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. పోలీసులు గ్రామంలో విచారించి బంధువులకు సమాచారం తెలియజేశారు.

ఈతకు వెళ్లి బాలుడు..

నంద్యాల టౌన్, జూన్16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయక నగర్ చెందిన బాలుడు మహేశ్ (17) ఈతకు వెళ్లి మృతి చెందినట్లు తాలుకా సీఐ ఈశ్వరయ్య తెలిపారు. వివరాల మేరకు.. ఉశేనమ్మ, బోయ నాగరాజు దంపతుల కుమారుడు మహేశ్ స్నేహితులతో కలిసి చాపిరేవుల వద్ద ఉన్న బావికి ఈతకు వెళ్లాడు. అయితే ఈత రాకపోవడంతో బావిలో మునిగి మృతి చెందాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి...

కర్నూలు క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాలపాడు వంతెన వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని రామకృష్ణారెడ్డి (56) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పాలకూరు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి కర్నూలు సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం బైక్‌పై ఊరికి వెళ్తుండగా.. బ్రిడ్జి పై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య కొడుకు, కూతురు ఉన్నారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల దాడి.. బాలుడికి గాయాలు

బేతంచెర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీ సోమవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన రాజేష్, మౌనిక దంపతుల రెండేళ్ల కుమారుడు ప్రణీత్ ఇంటి ముందు ఆడుకుంటుండగా.. నాలుగు కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. బాలుడి అరుపులు విన్న కాలనీ వాసులు కుక్కల్ని తరిమి బాలుడి ప్రాణాలు కాపాడారు. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు భార్గవ్ యన్నా కాలనీకి చేరుకుని బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం బోయపేటలో ఆరేళ్ల పాపను కుక్కలు దాడి చేసి గాయపరిచాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి పిల్లల ప్రాణాలను కాపాడాలని కోరారు.

వాహనం దగ్ధం

వెల్దుర్తి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్‌లోని ఇండేన్‌గ్యాస్ ఆఫీసు వెనుక ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో వాహనం దగ్ధమైంది. వివకాల మేరకు అక్కడున్న పాత పాతటైర్లు అంటుకోవడంతో వాహనానికి మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. గమనించిన కాలనీవాసులు డోన్ అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వారు చేరుకొని మంటలను అదుపుచేశారు. కాగా వాహనం క్యాబిన్ పూర్తిగా దగ్ధమైంది, గ్యాస్ ఏజెన్సీ ఉన్న ఇంటికి పైపులు పూర్తిగా దెబ్బతిని, గోడకు పగుళ్లు ఏర్పడ్డాయి. రూ.5లక్షలు ఆస్తినష్టం సంభవించిందని ఐచర్ యజమాని మధు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పూర్తిగా కాలిపోయిన వాహనం

బియ్యం దొంగలు ఎవరు..?

- ఆదోని శివారులోని ప్రైవేట్ గోదాములో గుర్తించిన బియ్యం చుట్టూ సందేహాలు
- నందికొట్కూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లోని 94 బస్తాల బియ్యం ఏమయ్యాయి..?



బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్



మిగిలిన బియ్యాన్ని చూపుతున్న డిప్యూటీ తహసీల్దార్ బాబు, ఆర్ఐ ఖాశీం

కర్నూలు/ఆదోని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని శివారులో శుక్రవారం అర్ధరాత్రి తూకాలు వేసి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన ఓ ప్రైవేటు గోదాములో ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు తనిఖీ చేశారు. సుమారుగా 1,500-1,800 బస్తాలు పేదల ఆకలి తీర్చే బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు సమాచారం ఇచ్చారు. గోదాముకు కల్లుబావి వీఆర్ఓ రాజశేఖర్‌గౌడ్ వేసిన తాళం శనివారం ఉదయం తెరిస్తే బియ్యం బస్తాలు కనిపించలేదు. ఇది ఎలా సాధ్యం..? బియ్యం దొంగలు ఎవరు..? కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నుంచి బీజేపీలో చేరిన ఓ యువనేత ఓ పోలీస్ అధికారితో కలసి రేషన్ బియ్యం మాఫియా నడిపారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ మూఠానే మాయం చేసిందా..? అనే ప్రశ్నలు ఎన్నో రేకెత్తాయి.

ఆదోని అడ్డాగా జరుగుతున్న బియ్యం దందా ఈ నాటికి కాదు. వైసీపీ ప్రభుత్వం రాక ముందు వరకు పలువురు వ్యాపారులు రేషన్ బియ్యం సేకరించి రహస్యంగా సరిహద్దులు దాటించి కర్ణాటకకు చేర్చేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాజకీయ అండతో 'బియ్యం మాఫియా' ఏర్పడటంతో భారీ దందా మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో 'చిన్న బాస్'గా పేరుగాంచిన వైసీపీ యువ నాయకుడి నేతృత్వంతో బియ్యం మాఫియా పెట్రేగిపోయింది. ప్రతి నెల 25-35 లారీలు (ఒక్కో లారీ 18-20 టన్నులు) బియ్యం అక్రమంగా ఏపీ సరిహద్దులు దాటించేవారనే ఆరోపణలు ఉండేవి. ఆ యువనాయకుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. వైసీపీని వీడి బీజేపీలో చేరారు. పార్టీ మారినందుకు ప్రతిఫలంగా ఆ యువ నాయకుడికి బియ్యం అక్రమ రవాణా అప్పగించారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈయనకు ఓ పోలీస్ అధికారి కూడా అండగా నిలిచారని సమాచారం. వైసీపీ నుంచి వచ్చిన యువ నాయకుడిని కాదని రెండు నెలల క్రితం అధికార పార్టీకి చెందిన మరో వర్గం రేషన్ బియ్యం మాఫియాగా మారిందనే చర్చ కూడా ఉంది. కొత్తగా బియ్యం అక్రమ రవాణాలోకి దిగిన వ్యక్తులు వివిధ మార్గాల్లో సేకరించిన రేషన్ బియ్యం రవాణాకు సిద్ధం చేయగా.. పక్కగా సమాచారంతో ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు దాడులు చేసినట్లు తెలుస్తోంది.

బియ్యం మాయం వెనుక పాత్ర ఎవరిది?

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాల మేరకు వెళ్లిన కల్లుబావి గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్ఓ) రాజశేఖర్‌గౌడ్ సమక్షంలో ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్ నాయుడు బియ్యం అక్రమంగా నిల్వ చేసిన గోదాముకు తాళం వేశారు. ఆ తాళం చెవి వీఆర్‌వో వద్దే ఉంచినట్లు తెలుస్తోంది. తాళం వేసిన గోదాములో సుమారు 750-900 క్వింటాళ్ల బియ్యం ఉంటాయని అంచనా. సివిల్ సప్లయ్ శాఖ లెక్కల ప్రకారం వాటి విలువ సుమారుగా రూ.35 లక్షలు పైమాటే అని అధికారులే అంటున్నారు. ఇంత విలువైన బియ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదే. కానీ రాత్రికిరాత్రే బియ్యం మాయం కావడం చర్చనీయాంశమైంది. బియ్యం నిల్వలు ఉన్న వీడియోలు రాత్రే సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు చేరాయి. ఆయన తక్షణమే స్పందించి పోలీసుల రక్షణ కల్పించి ఉంటే బియ్యం మాయం అయ్యేవి కాదుకదా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వేసిన తాళం వేసినట్లే ఉంది.. బియ్యం మాత్రం కనిపించడం లేదు. ఇవి అంతుచిక్కని ప్రశ్నలుగా మిగిలిపోయాయి.

ఆ బియ్యం ఎలా వచ్చాయి..?

నందికొట్కూరు సివిల్ సప్లయ్ మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ గోదాములో వివిధ దాడుల్లో పట్టుబడిన 984 బస్తాల(492 క్వింటాళ్లు) రేషన్ బియ్యం నిల్వ ఉన్నాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు వాటిని బహిరంగ వేలాం ద్వారా విక్రయించి వచ్చిన నగదును ట్రెజరీలో జమ చేయాలి. అయితే.. 15 రోజుల క్రితం ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్ నాయుడు ఆ గోదామును తనిఖీ చేశారు. ఆ సమయంలో రికార్డుల్లో ఉన్న పట్టుబడి రేషన్ బియ్యం 984 బస్తాలు గోదాములో మాయం అయినట్లు గుర్తించారు. గోదాము ఇన్‌చార్జిగా ఉన్న అధికారే మాయం చేశారా..? అనే ప్రశ్న తలెత్తింది. ఇటీవల బదిలీల్లో భాగంగా గోదాము ఇన్‌చార్జి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో వచ్చిన డీటీ మాయమైన సీజ్ చేసిన బియ్యం లెక్కలు చెబితే తప్ప బాధ్యతలు తీసుకోలేనని తెగేసి చెప్పినట్లు సమాచారం. మాయమైన రేషన్ బియ్యం ఎంఎల్ఎస్ గోదాములో కనిపించాయి. వీటి చుట్టూ ఉన్న ప్రశ్నలపై సమగ్ర విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని పట్టుకున్న డీటీ శివరాం

కల్లూరు. జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ 19వ వార్డు పరిధిలోని సోమిశెట్టినగర్-2లో అక్రమంగా తరలిస్తున్న నాలుగు ప్యాకెట్ల పీడీఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారు శివరాం పట్టుకున్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడి చేసిన అధికారులు షాప్ నెంబరు 144 నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసు కున్న టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిటీ శివరాం పంచనామా నిర్వహించి షాప్ నిర్వాహకులపై 6-ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సచివాలయ వీఆర్వో మహమ్మద్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో నేటి నుంచి బదిలీలు

- ఉమ్మడి జిల్లాలో 135 మంది జాబితా సిద్ధం
- కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ



కర్నూలు హాస్పిటల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా క్యాడర్ల ఉద్యోగులకు సాధారణ బదిలీలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం పరిధిలోని 18 క్యాడర్లకు సంబంధించిన 135 మంది ఉద్యోగులను బదిలీ చేసేందుకు జాబితాలను సిద్ధం చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్లు, ఎంపీహెచ్ఏ (ఎం)లు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంపీహెచ్ఏ (ఎఫ్)లకు, 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జూనియర్ అసిస్టెంట్, ఎల్‌డీ కంప్యూటర్ ఆఫీస్ సబార్డినేట్‌లు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, క్లీనర్, వాచ్‌మెన్, తోటి హెల్పర్, స్వీపర్, ఎఫ్‌డబ్ల్యూడబ్ల్యూ (ఎం) స్ట్రెచర్ బేరర్, ఫీమెల్ అటెండర్, ఎక్స్‌రే అటెండెంట్, ల్యాబ్ అటెండెంట్‌లకు బదిలీలు జరుగుతాయన్నారు. బదిలీల కౌన్సిలింగ్ పీహెచ్‌సీలోనే జూమ్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కూడా పీహెచ్‌సీ లోనే ఉండి కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

సెల్లార్‌లో దుకాణాలు

- పార్కింగ్ స్థలంలో షాపులతో ట్రాఫిక్ సమస్యలు
- అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో అధికారుల ఆదేశాలు బేఖాతరు



సెల్లార్‌లోని దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లోని బీ అండ్ ఈ బ్లాక్‌లో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌లో దుకాణాలు నిర్మించారు. బ్లాక్‌ల ముందు పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో నగరపాలక అధికారులు నోటీసు లు జారీ చేసినా ఫలితం కనిపించలేదు. సుమారు 25 సంవత్సరాల నుంచి ఇదే పరిస్థితి. ఇటీవల పెరిగిన నగర జనాభా వల్ల సమస్య తీవ్రమైంది. ప్రతి రోజు అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లోకి సుమారు 200 నుంచి 300 వంద వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాటి మధ్య నుంచి పాదచారులు అటు వెపు వెళ్లడం కష్టంగా ఉంది. ఇక్కడ పార్కింగ్ లేకపోవడంతో ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ ఆవరణలో వాహనాలను నిలుపుకొని వెళ్తున్నారు.



సెల్లార్‌లో ఏర్పాటు చేసిన దుకాణం

ధనార్జనే ధ్యేయంగా సెల్లార్‌లో దుకాణాలు..

అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్ యజమాని ధనార్జనే ధ్యేయంగా సెల్లార్‌లో నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్మించారు. సెల్లార్‌లో పార్కింగ్ కోసం స్థలం కేటాయించకుండా 100 దుకాణాలను నిర్మించి అద్దె వసూలు చేస్తున్నారు. ఒక్కో దుకాణానికి రూ.10 నుంచి రూ.15, రూ.20, రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన యజమానికి ప్రతి నెల ఎంతలేదన్నా రూ.12,50,000 వరకు ఆదాయం వస్తున్నది.

యజమానికి 1955 సెక్షన్ 636 ప్రకారం నోటీసు జారీ

స్థల యజమానికి భవనాల నిర్మాణానికి మంజూరు చేసిన ప్లాన్‌కు విరుద్ధంగా వాహనాల పార్కింగ్ కోసం ఉపయోగించాల్సిన సెల్లార్‌లో దుకాణాలు, గోడౌన్‌లు నిర్మించడంతో నగర పాలక సంస్థ చట్టం 1955 సెక్షన్లు 441,443,452,461,462, 636 ప్రకారం 2018 మేలో నోటీసులు జారీ అయ్యాయి. అంతే కాకుండా 2006 అక్టోబర్ 28న ఏపీ హైకోర్టు .డబ్ల్యూపి.నెంబరు 15591/2006 సుమోటాగా స్వీకరించింది. సెల్లార్ స్థలంలో కట్టడాలను సొంత ఖర్చుతో తొలగించాలని ఆదేశించింది. ప్రభుత్వ పురపాలక పరిపాలనా విభాగం నుంచి మెమోనెంబరు 20471/బి4/2006 తేది. 6.4.2007లో కూడా యజమానికి మెమో జారీ చేశారు. అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్ యజమాని ఉత్తర్వులు పాటించకుంటే సెక్షన్ 636 హెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం సెల్లార్‌లోని కట్టడాలను నగర పాలక సంస్థ తొలగించాలని, దానికి అయ్యే ఖర్చు కూడా వసూలు చేయాలని, అరెస్టు చేయవచ్చని పేర్కొంది.

యజమానికి కమిషనర్‌కు లేఖ

1955 చట్టం ప్రకారం నోటీసులు రావడంతో స్థల యజమాని నగర పాలక కమిషనర్‌కు 08.08.2028న లేఖ రాసాడు. నిబం ధనల ప్రకారమే 12 సెంట్లలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తానని, దుకాణాలను తొలగిస్తానని, సిసి కెమెరాలు, పార్కింగ్‌లో లైటింగ్, పెయింటింగ్‌తో పాటు సెక్యూరిటీ ఏర్పాటుకు అంగీకరిస్తు న్నట్లు అందులో ఉంది. ఇప్పటికి ఏడేళ్ల దాటింది. యజమాని ఎలాంటి చర్యలు చేపట్ట లేదు. గత నాలుగు నెలల నుంచి నగర పాలక కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అబ్దుల్లా ఖాన్ ఎస్టేల్‌లో సెల్లార్‌లో దుకాణాల వల్ల తలెత్తుతున్న ట్రాపిక్ సమస్యపై పలు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధికారులు సంబంధిత యజమానికి మరోసారి నోటీసులు జారీ చేశారు.

దుకాణాలు తొలగించాలని గుర్తుచేశాం



2018 సంవత్సరంలో స్థల యజమానికి సెల్లార్‌లో దుకాణాలు తొలగించాలని కోర్టు ఉత్తర్వులతో పాటు నోటీసులు జారీ చేశాము. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. మరోసారి గుర్తు చేశాం. యజమానికి స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. **- ప్రదీప్‌కుమార్, సిటీ ప్లానర్, నగర పాలక సంస్థ**

డీసీసీబీని అభివృద్ధి చేయండి

- సింధూర్ పథకంతో అధిక వడ్డీ
- చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి



సింధూర్ డిపాజిట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకులతో సమానంగా రైతులకు, మహిళలకు అన్ని వర్గాల వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అభివృద్ధి చేయాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి 333 రోజుల వ్యవధికి సంబంధించిన సింధూర్ అను నూతన డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారు. డిపాజిట్‌దారులకు ఎంతో ప్రయోజనాన్ని అందించే ఈ డిపాజిట్ స్కీంను కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇతర అన్ని బ్యాంకులకన్నా అత్యధికవడ్డీ పొందే అవకాశం ఉందన్నారు. సీఈవో రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేసిన వారికే పదవులు

- ఎంపీ, ఎమ్మెల్యే సిఫారసులుతో పదవులు రావు
- నేరుగా హైకమాండ్ నుంచే..
- 25లోపు కమిటీల ఎంపిక పూర్తి కావాలి
- కోడుమూరు టీడీపీ పరిశీలకుడు రామలింగారెడ్డి



మాట్లాడుతున్న కోడుమూరు టీడీపీ పరిశీలకుడు రామలింగారెడ్డి, పక్కన ఎమ్మెల్యే దస్తగిరి, సమావేశానికి హాజరైన నాలుగు మండలాల కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు

కర్నూలు రూరల్ జూన్ 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన వారికే నామినెటెడ్ పదవులు వస్తాయని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు రామలింగారెడ్డి మండల నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు సిఫార సులు చేస్తే పదవులు రావని అన్నారు. సోమవారం కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో కోడుమూరు నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పార్టీ పరిశీలకుడు రామలింగారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీ సీబీ చెర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మరో పరిశీలకుడు బత్తిన వెంకట రాముడు, మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. రామలింగారెడ్డి మాట్లాడు తూ పార్టీకి పనిచేయకపోతే న్యాయం జరగదని, పనిచేసిన వారికి రాష్ట్ర హైకమాండే నేరుగా పదవులు కేటాయిస్తుందని సూచించారు. వైసీపీ నుంచి వచ్చిన వారికి పదవులు రావని, వారితో టీడీపీకి పనిచేయించు కోవాలని ఎవరు కూడా ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని కార్యకర్త లకు ఆయన స్పష్టం చేశారు. ఈనెల 25వ తేదీలోపు మండల, క్లస్టర్, గ్రామ, బూత్ స్థాయి కమిటీల ఎన్నిక పూర్తి చేయాలని ఆదేశించారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణం జరగాలంటే అందరం కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతి అర్హులైన తల్లుల ఖాతాల్లోకి సీఎం చంద్రబాబు తల్లికి వందనం నగదు జమచేశారని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికి వరకు రూ.20కోట్ల వరకు అభివృద్ధి పనులు చేస్తున్నామని, వాటితో పాటు అనేక మంది రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేశామన్నారు. ప్రభుత్వం చేసిన ఇలాంటి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో గ్రామ స్థాయిలో విఫలమయ్యారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం విష్ణువర్ధన్‌రెడ్డి తాను కలిసి సీఎం చంద్రబాబు మాట్లాడి మరిన్ని నిధులను విడుదల చేయించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు, కోడుమూరు, సి.బెళగల్, గూడూరు, మండల టీడీపీ కన్వీనర్లు బోయ బుర్ర వెంకటేష్ నాయుడు, రామకృష్ణారెడ్డి, బోయ చంద్రశేఖర్ నాయుడు, జగ్గుల సురేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: కమిషనర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన అర్జీలను పరిశీలించి అధికారులు జవా బుదారీతనంతో సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వ హించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14 అర్జీలు వచ్చాయి. ఒక్కొక్క అర్జీదారుడి నుంచి సమస్యను అడిగి తెలుసు కుంటూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధి కారులను ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్క రించాలన్నారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

కార్బైడ్ పరిశ్రమను తెరిపించాలి: సీఐటీయూ

కర్నూలు న్యూసిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ పరిధిలో ఉన్న వీబీసీ (కార్బైడ్)పరిశ్రమను తెరిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మికుల పీఎఫ్ బకాయిలు చెల్లించాలన్నారు. పరిశ్రమలో రాత్రిపూట దొంగతనంగా విలువైన సామగ్రిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గత 20 సంవత్సరాలుగా పరిశ్రమలో 250 మంది కార్మికులు పని చేస్తున్నార న్నారు. గతంలో ఈ పరిశ్రమను ప్రముఖ పారిశ్రామిక వేత్త రామారావు కుటుంబము నడిపిందని, ఇన్‌టైంలో బ్యాంకులో ఉన్న అప్పులు కట్టకపోవడంతో ఈ పరిశ్రమ లిక్విడేషన్‌కు వెళ్లిందన్నారు. కామిని స్టీల్ యాజమాన్యం రూ.500కోట్ల విలువ చేసే పరిశ్రమను కేవలం రూ.100 కోట్లకు లిక్విడేషన్‌లో తీసుకున్నారన్నారు. కొత్త యాజమాన్యం పరిశ్రమను నడపకుండా దాని ఆస్తుల్ని అమ్మాలని ప్రయత్నం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదిశేషన్న, లక్ష్మన్న, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు

కర్నూలు న్యూసిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. సోమవారం గిప్సన్ కాలనీలోని ఆమె నివాసంలో కర్నూలు నియోజకవర్గంలో వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేయంకుడా మోసం చేశారన్నారు. వైసీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నార న్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ బాబాకు జ్యోతిష్య జ్ఞానరత్న పురస్కారం



జ్యోతిష్య జ్ఞానరత్న పురస్కారం అందుకుంటున్న ఎస్ఎస్ బాబా

కర్నూలు కల్చరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితుడు ఎస్ఎస్ బాబా జ్యోతిష్య జ్ఞానరత్న పురస్కారం అందుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాదులోని విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 16వ వైదిక జ్యోతిష్య సదస్సులో ఈ పురస్కారం అందజేశారు. దైవజ్ఞ రత్న, బహుగ్రంథ రచయిత పుచ్చ శ్రీనివాసరావు, జ్యోతిష్య విశారద గ్రంథ రచయిత పాలపర్తి శ్రీకాంత్ శర్మ తదితరుల చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేస్తూ జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువతో ఎస్ఎస్ బాబాను సత్కరించారు. ఎస్ఎస్ బాబా మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా తన జీవితాన్ని జ్యోతిష్య సేవకు అంకితం చేశానని తెలిపారు.ఈ పురస్కారం ఒక ప్రేరణగా భావిస్తూ జ్యోతిష్య రంగంలో మరింత సేవలు అందించే దిశగా ముందుకు పోతానని ఆయన పేర్కొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అనుమతులు రాకపోయినప్పటికీ అడ్మిషన్లు ఓపెన్ అయ్యాయని, మీ పిల్లల బంగారు భవిష్యత్తు ఉంటుందని అసత్య ప్రచారాలు చేస్తున్న ఓ పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్ఎస్ఎఫ్, డీఎస్ ఎఫ్ సంఘం నాయకులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఆర్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్, డీఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు మధు, వంశీ, అంజి పాల్గొన్నారు.

● **జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలి:** జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్యను అందించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర, నగర గౌరవాధ్యక్షులు శివకుమార్, నగర అధ్యక్షులు శివశంకర్, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డె శ్రీనివాసులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

20న అంతర్ పాఠశాలల షూటింగ్ బాల్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 20న పట్టణంలో విఠల్ నగర్‌లో ఉన్న గుడ్‌షప్పర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో సబ్ జూనియర్ అండర్-16 బాలబాలికలకు జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల షూటింగ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. టీమ్స్ రిజిస్ట్రేషన్ కోసం ఆర్గనైజింగ్ సెక్రటరీ మధు 9642151516ను సంప్రదించాలని సూచించారు.

గృహ నిర్మాణాల పరిశీలన

సి.బెళగల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబదహాల్, సిబెళగల్ గ్రామాల్లో నిర్మిస్తున్న గృహాలను ఎంపీడీవో రాణెమ్మ సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వాటిని నిర్మించుకోకపోతే వాటిని రద్దు చేస్తామన్నారు. ఆమె వెంట ఏఈ సుమంత్, వర్క్ ఇన్స్‌పెక్టర్ రంగన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఓర్వకల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామంలో సోమవారం నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పొదుపు మహిళలు, తల్లికి వందనం తల్లులతో కలిసి సుంకులమ్మ దేవాలయం ఎదురుగా సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో నగదు జమ కావడంతో వారి ఆనందానికి అవదులేవని అన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మల్లెల రాజశేఖర్ ఫొటో ఉన్న తల్లికి వందనం స్టిక్కర్లను ఇంటింటికి వెళ్లి అతికించారు. కార్యక్రమంలో పొదుపు మహిళలు, నాయకులు, పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని 17వ వార్డు కార్పొరేటర్ క్రైపా పద్మలతారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి కోసం ఈ శిక్షణలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రైవేటు ఆఫీసర్ వరలక్ష్మీదేవమ్మ, వెల్దుర్తి బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, ఆర్.నవీన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో కరెంటు సరఫరాలో నేడు అంతరాయం ఉంటుం దని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు పలు కాలనీల్లో కరెంట్ ఉండదన్నారు. అశోక్‌నగర్, వెంకట రమణకాలనీ, రామలింగేశ్వరనగర్, కప్పలనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు ఈఅసౌకర్యాన్ని గుర్తిం చి అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు.

ఉల్చాల నుంచి రోడ్డు వేయాలి

కర్నూలు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం ఉల్చాల నుంచి తొలిశాపురం వరకు రోడ్డు వేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం డీఆర్వోకు వినతి పత్రం సమర్పించారు. రాఘవేంద్ర మాట్లాడుతూ కర్నూలు మండలం తొలిశాపురం గ్రామానికి మజారా గ్రామమైన బసాపురం గ్రామ ప్రజలు ఏ చిన్న అవసరం వచ్చినా సచివాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ సేవలు పొందాలంటే సచివాలయానికి 7 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉందన్నారు. ప్రకాష్, హరికిషన్ రెడ్డి, రఘువరన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం 1988-1993 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు బి.మహేశ్వరరావు, పీటీ లక్ష్మీనారాయణ, ఆర్.అరవింద్, వై.వేణుగోపాల్ ఆధ్వర్యంలో అప్పటి గురువులు దేవనాయుడు, స్వామి, రమణలను పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. అనంతరం ఒకరికొకరు యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిమ్మయ్య ఆచారి, పుల్లయ్య, సతీష్, రమణ, మస్తాన్, భూషణ్ పాల్గొన్నారు.

ఏవోగా మధుమతి బాధ్యతల స్వీకరణ

ఓర్వకల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండల వ్యవసాయాధికారిగా మధుమతి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏవో సుధాకర్ ఆదోనికి బదిలీ కావడంతో ఎమ్మిగనూరులో ల్యాబ్‌లో పని చేస్తున్న మధుమతి ఓర్వకల్లు మండల వ్యవసాయాధికారిగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనం తరం ఆమె ఓర్వకల్లులోని ఆర్‌బీకే కేంద్రంలో వ్యవసాయా విస్తరణా ధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపీ డీవో శ్రీనివాసులును ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎంపీఈవోలు అందుబాటులో ఉండాలి: ఏవో

సి.బెళగల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎంపీఈవోలు రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఎంపీఈవోలతో సమావేశమయ్యారు. మల్లేష్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయా లన్నారు.

ఏకాగ్రతతోనే లక్ష్య సాధన

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతోనే లక్ష్యాన్ని సాధించవచ్చునని జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పి.హరి నాథ్ చౌదరి అన్నారు. సోమవారం నగరంలోని డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఒలింపిక్ డే రన్ సందర్భంగా అంతర్ పాఠశాలల విద్యార్థులకు విలువిద్య పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. విలువిద్య సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య, కోచ్ సునీల్ కుమార్, న్యాయవాదులు బాలాజీరెడ్డి, దీపిక, క్రీడాకారులు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ వర్తింపజేయాలి: సీఐటీయూ



గూడూరులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

కోడుమూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తల్లికి వందనం పథకం అంగన్‌వాడీలకు కూడా వర్తింపజేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజే యకుండా చేశారని అన్నారు. చాలీ చాలని జీతంతో అంగన్‌వాడిలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గఫూర్‌మియా, అంగన్‌వాడీలు అరుణ, హైమావతి, రజియా, ఫాతిమా పాల్గొన్నారు.

గూడూరు: అంగన్‌వాడీలందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం గూడూరులో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గూడూరు తహసీ ల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీలు ధర్నా చేశారు. జె మోహన్ మాట్లాడుతూ అంగన్‌వాడీలను ఆన్‌లైన్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా చూపడంతో వారికి ఎటువంటి ప్రభుత్వ పథకాలు అమలు కావడం లేదన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గుంటప్ప, అం గన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల నాయకులు సుజాత, రత్నమ్మ, సునంద, నాగేంద్రమ్మ, రామాంజనమ్మ, వరలక్ష్మీ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో మండల స్థాయి ప్రత్యేక అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహిం చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలతో సచివాలయ సిబ్బంది మమేకమై యోగాంధ్రలో పాల్గొనాలని సూచించారు. కార్యక్ర మంలో నోడల్ అధికారి శ్రీనివాసులు, ఎంపీడీవో రఘునాథ్, తహసీ ల్దార్ రమేష్‌బాబు, ఏఈ.లు ముక్తార్ బాషా, రంగస్వామిగౌడ్, ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈవోఆర్డీ జాకీర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన యువకులతో నాయకులు

కర్నూలు అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ డీవీ సాంబశివుడు ఆధ్వర్యంలో కర్నూలు నగరానికి చెందని యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, నగర అధ్యక్షుడు జిలానీ బాషాలు వారికి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్ర మంలో నాయకులు కాశీం వలి, లాజరస్, ప్రతాప్, బి.రాజశేఖర్, నూరి, ఆశోక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ/ కల్లూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగర పరిధిలోని బుధవారపేట, జొహ రాపురం, శ్రీరామ్‌నగర్, ఖండేరి, ముజఫర్‌నగర్ ప్రాంతాలలోని సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సి.గురుశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల భూమిని పేదలందరికీ ఇస్తామని చెప్పిన హామీ హామీగానే హామీగానే మిగిలిపోయిందని విమర్శించారు. అనంతరం సచివాలయాల అడ్మిన్లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.అలివేలు, సుధాకరప్ప, టి.రాముడు, ఆర్.నరసింహులు, రంగ స్వామి, నాగరాజు, ఆర్.కృష్ణ, సోలమాన్‌రాజు, రమేష్‌బాబు, లక్ష్మన్న, రాజశేఖర్, ఖాజాపాషా, అయ్యస్వామి పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి: ఆర్‌వీఎఫ్

ఓర్వకల్లు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీని అరికట్టాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతి శీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న, స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగ సురేంద్ర యాదవ్ కోరారు. సోమవారం ఎంపీ డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో ఓంకార్ యాదవ్‌లకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాము, వెంకటేశ్, అనిల్, మధు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రాష్ట్రం అధోగతి: వైసీపీ

కర్నూలు రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని కోడుమూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ విమర్శించారు. సోమవారం కర్నూలులో తన స్వగృహంలో కర్నూలు జడ్పీటీసీ ప్రసన్న కుమార్, 40వవార్డు కార్పొరేటర్ విక్రమ్‌సింహారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో నారా లోకేశ్ అరాచకం సృష్టిస్తున్నారని ఆరోపించారు. నాయకులు మోహన్‌బాబు, నెహమ్యా, ప్రభాకర‌రెడ్డి, బుజ్జన్న పాల్గొన్నారు.

పంట రుణాలు మంజూరు చేయాలి



విష్ణువర్ధన్‌రెడ్డికి బొకే ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు రూరల్ జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా బ్యాంకుల్లో రైతులకు పంట రుణాలు మంజూరు చేయా లని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా సహా య కార్యదర్శి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవా రం రైతు సంఘం నాయకులు కర్నూలులో కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. జగన్నాథం మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు 15రోజులు కావస్తున్న చాలా చోట్ల బ్యాంక్‌లో రైతులకు పెట్టుబడి కోసం పంట రుణాలు ఇవ్వడంలో మరింత జాప్యం చేస్తున్నారని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. గతం కంటే ఈసారి వ్యవసాయానికి పెట్టుబడి భారీగా పెరిగిందని వివరించారు. రైతులకు రుణాలు ఇవ్వడానికే కేడీసీసీ బ్యాంకు ఉందని, గతంలో కంటే ఈసారి రుణాలను పెంచి ఇస్తున్నట్లు విష్ణువర్ధన్‌రెడ్డి రైతు సంఘం నాయకులకు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి మహేష్, సోమన్న ఉన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



రైతులకు ఈకేవైసీ అప్‌డేట్ చేయిస్తున్న రామాంజనేయులు

కల్లూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఏపీ అర్బన్ డెవలప్ మెంట్ డైరెక్టర్, కల్లూరు మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు అన్నారు. సోమవారం కే.మార్కాపురం, పెద్దకొట్టాల గ్రామాల్లో అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా నిర్వహించిన రైతుల ఈకేవైసీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంస పాలన సాగించిన వైసీపీని చిత్తుగా ఓడించి రాష్ట్ర ప్రజలు కూటమికి అఖండ మెజార్టీని కట్టబెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు సుపరిపాలన అందించే దిశగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. విద్యార్థుల తల్లులకు తల్లికి వందనం నగదు జమ కావడంతో కూటమి ప్రభుత్వంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, రాఘవేంద్ర, శేఖర్, రవి, మద్దిలేటి, అశోక్, లక్ష్మన్న పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభల పోస్టర్‌ను ఉపకులపతి వి.వెంకట బసవరావు, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వర్సిటీ ఎస్ఎఫ్ఐ కన్వీనర్ రామకృష్ణ మాట్లా డుతూ ఈనెల 27 నుంచి 30 వరకు కేరళ కేంద్రంగా విద్యార్థుల సమస్యలపై పోరాటాలకు వేదిక కాబోతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అమర్‌బాబు, అంజీ, నారాయణ, కృపాకర్, సీవన్ రవి పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి

కర్నూలు కల్చరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజాభ్యుదయ సంస్థ (పీవోపీ), భవన నిర్మాణ కార్మిక సంఘం (బీఎన్‌కేఎస్) ఆధ్వర్యంలో కార్మిక హక్కులను కాలరాచే సవరణలను ప్రతిపాదిస్తున్న ఫ్యాక్టరీల సవరణ బిల్లు 2025ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదురుగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా జయన్న, ప్రభుదాసు (భవన నిర్మాణ కార్మిక సంఘం) సీఐటీయూ రాధాకృష్ణ, ఎన్‌డీపీ చాంద్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఫ్యాక్టరీల చట్టం, 1948కి సవరణ చేసి పని గంటలను 8 నుంచి 10 గంటలకు పొడిగించారని, మహిళలతో రాత్రి షిఫ్టులో రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పని చేయిస్తారని అన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

క్రిష్ణగిరి తహసీల్దార్‌గా ప్రకాష్‌బాబు



క్రిష్ణగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా ప్రకాష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న దేవ చంద్రశేఖర్ పదవీ విరమణ పొందారు. నంద్యాల జిల్లా బేతంచర్లలో పనిచేస్తున్న ప్రకాష్‌బాబు బదిలీపై క్రిష్ణగిరికి వచ్చారు.

తుగ్గలి ఏవోగా సురేష్‌బాబు



వ్యవసాయాధికారికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీఈవోలు

తుగ్గలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా సురేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏవో పవన్ కుమార్ గడివేములకు బదిలీకాగా, దేవనకొండలో విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబును తుగ్గలి ఏవోగా బదిలీ చేశారు. సిబ్బంది ఏవోకు స్వాగతం పలికారు. ఏఈవో బాలసరస్వతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ లోహిత్ ఉన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

రైతులు ఈకేవైసీ చేయించుకుంటేనే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అన్నదాత సుఖీభవ వర్తిస్తుందని ఏవో సురేష్‌బాబు సోమవారం తెలిపారు. త్వరలో ప్రభుత్వం అందజేయనుందని, సమీప రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. ఇప్పటికే వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశామని, అందనివారు సంప్రదించాలన్నారు. కందులు, కొర్రలు, మినుములు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం

దేవనకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, సుభాన్ అన్నారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో మహిళలు, విద్యార్థులతో కలసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వెంకటస్వామిగౌడ్, కప్పట్రాళ్ల మల్లికార్జున, మలకన్న, భాస్కర్, కె.ఉచ్చీరప్ప, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, టీడీపీ నాయకులు

కుట్టు యంత్రాలను వినియోగించుకోవాలి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ బొజ్జమ్మ

దేవనకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కుట్టు యంత్రాలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ కోరారు. సోమవారం మండలంలోని జిల్లెలబుడకల గ్రామంలో ఐదు గ్రామాలకు చెందిన 50 మంది మహిళలకు కుట్టు యంత్రాలను పంపిణీ చేశారు. త్వరలో కుట్టు శిక్షణ ఇస్తామని అక్షిత ట్రస్టు చైర్మన్ రామాంజినేయులు తెలిపారు. మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబు రుణం తీర్చుకోలేం



పెండేకల్‌లో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

తుగ్గలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని అమలు చేసినందుకు, సీఎం చంద్రబాబు రుణం తీర్చుకోలేమని టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు చాంద్‌బాషా అన్నారు. సోమవారం పెండేకల్ ఆర్ఎస్‌లో సీఎం చంద్రబాబు, పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అభివృద్ధి పనులతో పాటు ఉచిత గ్యాస్ సిలిండర్, తల్లికి వందనం, అన్న క్యాంటీన్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఽ ఇచ్చారన్నారు. రఫీ, మాబు బాషా, మాబు, చిన్న రఫి, రామాంజి తదితరులు ఉన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

● ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): క్షయ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి కోరారు. సోమవారం హనుమాన్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయ నిర్మూలనకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోందని, ప్రజలు సహకరించాలన్నారు. వైద్యాధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ క్షయ బాధితులకు మందులు అందిస్తామన్నారు. ఆరు నెలలపాటు నెలకు రూ. వెయ్యి చొప్పున ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి, బాబురాజు, సుబ్బమ్మ బాయి, సుగుణమ్మ, లక్ష్మీబాయి, అంజలి పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడిగా మీనాక్షి నాయుడు



చిప్పగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికల జిల్లా పరిశీలకుడిగా ఏరూరు మీనాక్షి నాయుడు ఎన్నికయ్యారు. పార్టీ అధినాయకత్వం నుంచి నియామక పత్రం అందిందని మీనాక్షి నాయుడు సోమవారం తెలిపారు. కష్టపడే నాయకులకు పార్టీ పదవులు ఇస్తుందన్నారు. సర్పంచ్, మండల పరిషత్, జడ్పీ, మునిసిపాలి, నగర ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అభ్యర్థులను ఎంపిక చేస్తుందని వివరించారు. తనకు అవకాశమిచ్చిన మంత్రులు లోకేష్, టీజీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నీరు కావాలంటే బండి కట్టాల్సిందే



హెబ్బటం గ్రామంలో ఎద్దుల బండిపై డ్రమ్ముల ద్వారా నీరు తీసుకెళ్తున్న ప్రజలు

హొళగుంద, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెబ్బటం గ్రామంలో వారం నుంచి తాగునీరు రావడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామ శివారులోని పంప్‌హౌస్ సంపు వద్దకు వెళ్లి ఎడ్ల బండిపై డ్రమ్ములు, తోపుడుబండ్లు, సైకిళ్ల ద్వారా నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయితీ అధికారి రాజశేఖర్ గౌడ్‌ను వివరణ కోరగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● మాజీ మంత్రి కేఈ ప్రభాకర్



కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

వెల్దుర్తి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. సోమవారం గుంటుపల్లి గ్రామంలో ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు హామీలను నెరవేరుస్తున్నారన్నారు. బడులు తెరిచేనాటికే కుటుంబంలోని పిల్లలందరికీ 'తల్లికి వందనం' అమలు చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇంటిలో ఒక్కరికి మాత్రమే అమలు చేసిందన్నారు. ఈదుల వెంకటరాముడు, ప్రసాద్, ఆంజనేయులు గౌడ్ జుట్ల శేషిరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మద్దికెరలో బ్యాంకులు కిటకిట..

మద్దికెర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం నగదు జమచేయడంతో సోమవారం మండల కేంద్రంలో బ్యాంకులు కిటకిటలాడాయి. శని, ఆదివారాలు బ్యాంకులకు సెలవు కావడంతో సోమవారం ఉదయమే మద్దికెరలోని కెనరా బ్యాంకు, పెరవలిలోని ఆంధ్రప్రదేశ్ బ్యాంకులకు మహిళలు పోటెత్తారు. నగదు జమ అయిన వారు ఆనందం వ్యక్తం చేయగా, జమకానివారు నిరాశతో వెనుదిరిగారు.



బ్యాంకు వద్ద గుమికూడిన మహిళలు

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, జూన్16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అభివృద్ధి పక్కన పెట్టి రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వెన్నుటు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ వెన్నుపోటు పుస్తకంలో వ్యవస్థలు కూలి, ఆర్థిక భద్రత కోల్పోవడం సహా పలు అంశాలను పొందుపరచారన్నారు. కన్వీనర్లు మారయ్య, మల్లికార్జున, నాయకులు జనార్దన్‌నాయుడు, శేషప్ప, గిరి, భాస్కర్, నాగేంద్ర, మల్లికార్జున, రాజు, రాజశేఖర్, శివ, అరికెర ఉరుకుందు, వీరేష్ పాల్గొన్నారు.

సార్లూ ఇదేం తీరు?

● ప్రజావేదికకు ముగ్గురే హాజరు.. మిగతా వారు ఎక్కడ?



ప్రజావేదికలో ముగ్గురే అధికారులు

మద్దికెర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావలసి ఉండగా సోమవారం మద్దికెరలో ముగ్గురే కనిపించారు. తహసీల్దార్ గుండాల్ నాయక్, విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ మాత్రమే హాజరుకాగా, వ్యవసాయశాఖ అధికారి, ఏపీవో, ఎంఈవోలు సంతకాలు చేసి వెళ్లినట్లు తెలుస్తోంది. అన్ని శాఖల అధికారులు పాల్గొనే చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. కార్మికుల కోసం కేటాయించిన నిధులను బోర్డుకు జమచేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పరికరాలు అందించాలని కోరారు. కుమార్, నారాయణ, మల్లికార్జున, రామాంజినేయులు, పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

పత్తికొండ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) కార్యదర్శి కాంతమ్మ, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం సీడీపీవోకు వినతి పత్రం సమర్పించారు.

ఆస్పరి: అసోసియేషన్ కార్యదర్శి విశ్వకుమారి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బాలకృష్ణ, విజయలక్ష్మి, సరస్వతి, పద్మ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

తుగ్గలి: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ డిమాండ్ చేశారు. సోమవారం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం ఇచ్చారు. చాలీచాలనీ జీతాలు ఇస్తూ ప్రభుత్వ పథకాలకు అనర్హులను చేయడం సరికాదన్నారు. సీపీఎం మండల అధ్యక్షుడు శ్రీరాములు, అంగన్‌వాడీ వర్కర్లు, కుమారి, జ్యోతి, తులసి, కస్తూర్బాయి తదితరులు ఉన్నారు.

20న ఉచిత కంటి వైద్య శిబిరం

పత్తికొండ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఈ నెల 20న శుక్రవారం ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కురువ బండయ్య, శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కేడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ సారథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందన్నారు. వివరాలకు 9980269622, 06361707972 నంబర్లలను సంప్రదించాలన్నారు.

హుండీ లెక్కింపు

దేవనకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గద్దెరాళ్ల, కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టు కౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయాలల్లో సోమవారం హుండీని లెక్కించారు. గద్దెరాళ్ల మారెమ్మవ్వ హుండీ రూ.7.51 లక్షలు, కౌలుట్ల చెన్నకేశవస్వామి హుండీ రూ.1.9లక్షలు వచ్చినట్లు ఆలయాధికారి వీరయ్య తెలిపారు. మూడు నెలల క్రితం ఉత్సవాల అనంతరం హుండీని లెక్కించామన్నారు.

సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం

దేవనకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నట్లు ఎంఈవో తిమ్మారెడ్డి అన్నారు. సోమవారం జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారమే ఆహారం ఇవ్వాలన్నారు. వంట ఏజన్సీలు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని గుడిమిరాళ్ల పాఠశాల జడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ కాగా, జిల్లెలబుడకల మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా చేశారన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా లక్ష్మీనాథ్

వెల్దుర్తి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా లక్ష్మీనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా దొరపల్లి నుంచి బదిలీపై వెల్దుర్తికి వచ్చారు. అనంతరం ఎంపీడీవో సుహాసినమ్మ, డిప్యూటీ ఎంపీడీవో రవికిశోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పనిచేస్తున్న గురుస్వామి బదిలీ అయినట్లు సమాచారం.

అప్రమత్తంగా ఉండాలి

హాలహర్వి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మన్సూర్‌వలి సూచించారు. సోమవారం మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామాల్లోకి ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎవరికైనా అనారోగ్యం సంభవిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రైలు ఢీకొని మహిళకు గాయాలు

ఆదోని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన శ్రావణిని రైలు ఢీ కొట్టడంతో గాయాలయ్యాయి. రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపిన మేరకు.. ఎల్‌సీ 195 వద్ద గేటు దాటుతుండగా ట్రైన్ నెంబర్ 17301 బసవ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది.. గాయపడిన శ్రావణిని హుటాహుటిన ప్రభుత్వ సుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు.

రోడ్డు వేశారు.. డ్రైనేజీ మరిచారు

మద్దికెరలో కాలువలు లేని వీధి



మద్దికెర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయినగర్, రామ్‌నగర్, గ్రామంతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో రూ.80 లక్షలతో సీసీ రోడ్లు వేసి, డ్రేనేజీ నిర్మించలేదు. రోడ్లు గృహాల కంటే ఎత్తుగా ఉండటంతో వర్షపునీరు, మురుగు తమ ఇళ్లలోనికి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగుతో పాటు వర్షపు నీరు నిలిచి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ విష్ణు మాట్లాడుతూ కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు వచ్చిన వెంటనే నిర్మిస్తామన్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం ఎగనామం



బుక్‌లెట్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

● మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఎగనామం పెట్టిందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆరోపించారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1,500లను ఇస్తామని మరిచారన్నారు. వైసీపీ ఒత్తిడితోనే తల్లికి వందనం అమలు చేశారని అన్నారు. అనంతరం వెన్నుపోటు బుక్‌లెట్‌ను విడుదల చేశారు. కన్వీనర్ రవిరెడ్డి, మాజీ జడ్పీటీసీ దేశాయి సమీర్‌రెడ్డి, జడ్పీటీసీ సుంకన్న, సర్పంచి శైలజ, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలి

● ఎమ్మెల్యే పార్థసారథి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని, జూన్16(ఆంధ్రజ్యోతి): రైల్వే పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే పార్థసారథి సూచించారు. సోమవారం ఆదోని రైల్వేస్టేషన్ పరిధిలో చేస్తున్న అభివృద్ధి పులను పరిశీలించారు. రైల్వే ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ట్రాక్ ఇరువైపులా కేంద్రం ప్రహరీ ఏర్పాటు చేస్తుందన్నారు. బీజేపీ నాయకులు ఉపేంద్ర, నాగరాజ్‌గౌడ్, ధను పాల్గొన్నారు.

ఎస్సీ సర్టిఫికెట్లు ఇప్పించాలి

తమకు ఎస్సీ ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇప్పించాలని మాదాసి కురువ, మాదారి కురువలు ఎమ్మెల్యే పార్థసారథిని కోరారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో మాదాసి, మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం తెలుగు రాష్ట్రాల నాయకులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. రెవెన్యూ అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని కోరగా, అందరం కలిసి పోరాడదామని ఎమ్మెల్యే అన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రంగన సుంకన్న, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం



కృతజ్ఞతలు తెలుపుతున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

మద్దికెర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం కింద రూ.13వేలు ఇవ్వడంతో సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటామని తల్లిదండ్రులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పారా విశేబ అన్నారు. సోమవారం స్థానిక ఆది ఆంధ్ర పాఠశాలలో తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు. విద్యాకమిటీ చైర్మన్ రాము, శ్రీకాంత్, అరుణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి

● ఆర్డీవో భరత్‌నాయక్



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీవో

పత్తికొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న నిర్వహిస్తున్న యోగా డేను విజయవంతం చేయాలని ఆర్డీవో భరత్‌నాయక్ సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం పత్తికొండ మండల సమావేశ భవనంలో ఎంపీడీవో కవిత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. యోగా చేసేందుకు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు.

సుఖీభవను వర్తింపజేయాలి

వెల్దుర్తి టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డీ-పట్టా గల రైతులందరికీ అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు, అనిల్, రైతు ఎల్లరాముడు డిమాండ్ చేశారు. సోమవారం ఏవో అక్బర్ బాషాకు వినతి పత్రం అందజేశారు.

బస్సులకు ఫిట్‌నెస్ ఉండాలి

ఆలూరు, జూన్16(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పక ఉండాలని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలో స్కూల్ బస్సులను తనిఖీచేసి, డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బస్సులను వేగంగా నడపకుండా విద్యార్థులను జాగ్రత్తగా ఇళ్లకు చేర్చాలన్నారు.

ఎమ్మెల్యేను చుట్టుముట్టిన మహిళలు



ఎమ్మెల్యేను చుట్టుముట్టిన మహిళలు

ఆదోని రూరల్, జూన్ 16 ఆంధ్రజ్యోతి): తమకు తాగునీరు ఇవ్వడం లేదని మహిళలు ఎమ్మెల్యే పార్థసారధిని చుట్టుముట్టారు. ప్రజలకోసం పార్థసారధిలోభాగంగా, ఎమ్మెల్యే కూటమి నాయకులతో కలిసి ఆదోని మండలం ఢణాపురంలో పర్యటించారు. కారు దిగి నడుస్తూ వస్తున్న ఎమ్మెల్యేను గ్రామానికి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో ఘెరావ్ చేశారు. చేసేదేమీ లేక ఎమ్మెల్యే నవ్వుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రోడ్లు వేశారు.. డ్రైన్లు మరిచారు

● వర్షం వస్తే రోడ్లపై, ఇళ్ల ముందు మురుగు నిల్వ
● ఇబ్బందుల్లో ప్రజలు



టీబీపీ కాలనీలో రోడ్డుపైనే నిలిచిన వర్షం నీరు



ఇంటి ముందు గుంత ఏర్పాటు చేసుకున్న దృశ్యం

ఎమ్మిగనూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయా కాలనీల్లో మున్సిపల్ అధికారులు సీసీ రోడ్లు నిర్మించారు. అయితే వాటిపక్కనే మురుగు కాలువలు నిర్మించటం మరిచినట్లు కనిపిస్తోంది. దీంతో ఆయా కాలనీల వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. నివాసగృహాలకు ముందు సీసీ రోడ్లుకు మధ్యలో మురుగు కాలువ ఉన్నట్లైతే అటు వర్షం నీరు ఇటు ఇళ్ల నుంచి వచ్చే నీరు దిగువకు వెళ్లేందుకు ఆవకాశం ఉంటుంది. అయితే కొన్ని కాలనీల్లో మురుగు కాలువలు ఏర్పాటు చేయకపోవటంతో ఇళ్లనుంచి వచ్చే మురుగు నీరు ఇళ్లపక్కనే వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక వర్షం నీరు రోడ్లపై పడి ఇళ్లముందుకు రావటం లేదా ఇళ్లపక్కన ఉన్న ఖాళీస్థలాల్లోకి చేరుతోంది. వర్షం నీరు ఇంకి పోయే వరకు అలాగే ఇళ్లపక్కన ఉండటంతో వాటిపై దోమలు చేరి దుర్గంధం వెదజల్లటమే గాక రోగాలకు ఆస్కారంగా మారుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పట్టణంలోని శివారు కాలనీలైన టీబీపీ కాలనీ, రాధాకృష్ణ కాలనీ, మిలటరీ కాలనీ, మైనార్టీకాలనీ, మునెప్ప నగర్, పంపన్నగౌడ్ కాలనీల్లో ఈ పరిస్థితి నెలకొంది. టీబీపీ కాలనీలో గత ప్రభుత్వ హాయంలో ఎమ్మెల్యే నివాసం ఉంటున్న ప్రాంతంలోను, మున్సిపల్ వైస్ చైర్మన్ నివాసం ఉంటున్న ప్రాంతంలోను, గుడ్‌బేస్ పాఠశాల ఉన్న ప్రాంతంలో సీసీ రోడ్లు వేశారు. అయితే వాటికి అనుసందానంగా మురుగు కాలువలు నిర్మించలేదు. దీంతో వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. అలాగే గతంలో ఆర్‌అండ్‌బీ గెస్టెహౌస్ నుంచి మిలిటరీ కాలనీకి వెళ్లేందుకు సీసీ రోడ్డువేశారు. అయితే మురుగు కాలువ నిర్మించలేదు. అయితే రహదారి మధ్యలో యుజీడీ పైపైలైన్ ఏర్పాటు చేసి మ్యాన్‌హోల్ పెట్టినప్పటికి అవి పనిచేయటం లేదు. దీంతో ఆ రోడ్డు వెంబడి, రోడ్డుకు పక్కన నివసిస్తున్న వారు ఇళ్లముందు గుంతలు ఏర్పాటు చేసుకొని మురుగునీటిని అందులోకి వదులుకుంటున్నారు. ఆ గుంతలు నిండితే అతికష్టం మీద బకెట్లతో ఎత్తి దూరంగా ఖాళీస్థలంలో పోయాల్సి వస్తోంది. అలాగే లక్ష్మణ్ టాకీస్ వెనుక ప్రాంతంలో కూడా సీసీ రోడ్లు వేసి మురుగు కాలువలు వేయకుండా వదిలేశారు. పంపన్న గౌడ్ కాలనీలో ఇదే పరిస్థితి. రోడ్డుకు ఒక వైపు మాత్రమే మురుగు కాలువ ఏర్పాటు చేసి మరోవైపు అలాగే వదిలేశారు. అంతేగాక మునెప్ప నగర్ శివారుప్రాంతంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సీసీ రోడ్లు వేసి వదిలేశారు. దీంతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల యుజీడీకి ఇళ్లనుంచి పైప్‌లైన్ మ్యాన్‌హోల్‌కు ఏర్పాటు చేసినప్పటికి వర్షం నీరు పెద్దసమస్యగా మారుతోం. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఆయా కాలనీల్లో సీసీ రోడ్లతో పాటు మురుగు కాలువలు నిర్మించాల్సిన అవసం ఉంది

ఇబ్బందులు పడుతున్నాం



మున్సిపల్ అధికారులు సీసీ రోడ్లు వేశారు. అయితే డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయకపోవటంతో ఇబ్బంది పడుతున్నాం. ఇళ్లలోని మురుగునీటిని రోడ్లపైకి వదలేక ఇళ్లముందు గుంతలు ఏర్పాటు చేసుకున్నాం. అది నిండినప్పుడంతా ఎత్తిపోయాల్సి వస్తుంది. వర్షం నీరు ఇళ్లముందే నిలిచి పోతుండటంతో ఇబ్బందిగా మారింది.

కృష్ణమూర్తి, టీబీపీ కాలనీవాసీ ఎమ్మిగనూరు

మురుగు కాలువలు నిర్మించాలి



రోడ్డు వేసి చాలా ఏళ్ల అయ్యింది. అయితే మురుగు కాలువలు లేకపోవటంతో ఇళ్లలోని మురుగునీటిని ఎక్కడ వదలాలో తెలియటం లేదు. దీంతో ఇబ్బందిగా మారింది. వర్షం నీరైతే ఇళ్లముందుకు వచ్చి నిలిచి పోతున్నాయి. అధికారులు మురుగుకాలువలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

దుర్గమ్మ, కాలనీ వాసి, ఎమ్మిగనూర

గుంతలు ఏర్పాటు చేసుకున్నాం



మాకు రోడ్డు వేసినప్పటికి డ్రైనేజీ కాలువ లేకపోవటంతో మురుగునీరు రోడ్లపైకి వదలేక గుంతలు ఏర్పాటు చేసుకున్నాం. అవి నిండినప్పుడు ఖాళీస్థలాల్లో ఎత్తి పోస్తున్నారు. దీంతో మురుగుతో దుర్గంధం వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే మురుగు కాలావలు ఏర్పాటు చేయాలి.

పరిమళ, కాలనీవాసి, ఎమ్మిగనూరు

సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తాం



ఇప్పటికే పట్టణంలో రూ. 7కోట్లతో పనులు పూర్తి చేయటం జరిగింది. మరో రూ. 10 కోట్లతో పనులు చేపడు తున్నాం.ప్రాధాన్యాత క్రమాన్ని బట్టి సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీలు కూడా నిర్మిస్తాం. అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలి

మంత్రాలయం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలియజేసి తహసీల్దార్ ఎస్.రవికి, ఎంపీడీవో ఏవో రాధకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విశాలాక్ష్మి, దాక్షాయని, తులసమ్మ, ప్రమీలమ్మ, నరసమ్మ, శాంతమ్మ, భాగ్యమ్మ, ధనలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఎమ్మిగనూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సోమవారం ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్, సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను హరిస్తే ఉద్యమం తప్పదు

ఎమ్మిగనూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులు హరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యం తప్పదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి ఎస్ రాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. రాష్ట్రకమిటీ పిలుపుతో సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన నిర్వహించి కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కార్మికశాఖ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఏసేపు, హిజ్కెలు, అగస్టిన్, రాముడు, వెంకటేష్, ప్రతాప్, కిరణ్, పకీర్ సాబ్‌లు పాల్గొన్నారు.

కోసిగిలో ట్రాఫిక్ జామ్



ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కోసిగి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలో రోజురోజుకు ట్రాఫిక్ జామ్‌తో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండు నుంచి వాల్మీకి సర్కిల్ రైల్వేగేటు వరకు ప్రధాన దుకాణాల ముందు వాహనాలు నిలిచిపోవడంతో పాటు పంచాయతీకి సంబంధించిన దుకాణాదారులు రోడ్డు సమీపంలో దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ జామ్ సమస్య మరింత తీవ్రమవుతోంది. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి వాల్మీకి సర్కిల్ రైల్వేగేటు వరకు ట్రాఫిక్ జామ్‌తో భారీగా వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా రైల్వేగేటు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి పడటంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావాలంటే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జితో పాటు పంచాయతీ సంబందించిన దుకాణాలను రోడ్డు కిరువైపులా వాహనాలు నిలపకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్దకడబూరు ఏవోగా సుచరిత

పెద్దకడబూరు, జూన్16 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా సుచరిత సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈమె అనంతపురం జిల్లా ఆత్మకూరు ఏవోగా పనిచేస్తూ బదిలీపై పెద్దకడబూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల రైతుల సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన అందరికి అందేలా చర్యలు తీసుకుంటానన్నారు.

గోనెగండ్ల తహసీల్దార్‌గా రాజేశ్వరి

గోనె గండ్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల నూతన తహసీల్దార్ గా రాజేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కర్నూలు కలెక్టర్ కార్యాలయం నుంచి గోనెగండ్లకు బదిలీ అయ్యారు. అయితే గోనెగండ్లలో పనిచేస్తున్న కుమారస్వామి కర్నూలుకు బదిలీ పై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వరి గ్రామాల్లోని భూసమస్యలను పరిష్కరించేందుకు తమ కృషి చేస్తామని అన్నారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకిరించిన రాజేశ్వరికి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.

కౌతాళం ఎంపీడీఓగా రాజేంద్ర ప్రసాద్

కౌతాళం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలం ఎంపీడీఓగా సోమవారం రాజేంద్ర ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ విజయ శేఖర రావు ఆదోని మండలానికి బదిలీ కావడంతో అక్కడ పని చేస్తున్న రాజేంద్ర ప్రసాద్‌ను కౌతాళానికి అధికారులు బదిలీ చేయడంతో రాజేంద్ర ప్రసాద్ సోమవారం కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని గతంలో ఇదే మండలానికి ఎంపీడీఓగా పని చేసిన అనుభవం ఉందని త్వరగా మండలాభివృద్ధికి పాటు పడుతానని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీవోకు తీవ్ర అస్వస్థత

ఎమ్మిగనూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఎంపీడీవో బంగారమ్మ సోమవారం ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతపాలయ్యారు. విధులకు హాజరైన ఆమె కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతండగా తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో వెంటనే సిబ్బంది పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు జడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఎంపీడీఓ బంగారమ్మను పరామర్శించారు. మెరుగైన వైదం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా చంద్రమౌళి

ఎమ్మిగనూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటి సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా చంద్రమౌళి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఆయనను హిందూపురం నుంచి ఎమ్మిగనూరుకు బదిలీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యదర్శి పద్మావతి, డీఈ భాస్కర్ రెడ్డి, సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. అలాగే మార్కెట్ కమిటి కమీషన్ మర్చెంట్ అసోషియేషన్ పెద్దలు జగన్నాథరెడ్డి, బాబు, అనిల్, కృష్ణమూర్తిలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అంటువ్యాధులతో జాగ్రత్త



సమావేశంలో మాట్లడుతున్న ఈవోఆర్‌డీ అనంతశయన

గోనెగండ్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అంటువ్యాధులు ప్రబలే సీజన్ కావడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఈవోఆర్‌డీ అనంతశయన, గ్రామమేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ అడపాదడపా వర్షాల కారణంగా గ్రామాల్లోని వీధుల్లో వర్షపు నీరు నిలిచి ఈగలు, దోమలు పెరిగి అంటవ్యాధులు ప్రబలు తున్నాయి. గోనెగండ్లలోని పలు వీధుల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కాలువలో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్, జేసీబీ లతో తొలగించారు. అంటువ్యాధులు ప్రభల కుండా దోమల నివారణ మందును మురికి కాలువలలో పిచికారి చేయించారు. ఇందకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుభాన్, పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: వైసీపీ



'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని బుట్టా రేణుక ఆరోపించారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో బుట్టా రేణుక మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తే రెడ్ బుక్ పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారని, ఏడాది పాలన అంతా మోసాలు, అరాచకాలే కనిపిస్తున్నాయన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఇచ్చిన హామిలను అమలు చేసేంత వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి నిద్ర లేకుండా చెస్తామన్నారు. హామీలు అయ్యో వరకు ప్రజల పక్షాలన పోరాడతామన్నారు. కార్యక్రమంలో వైసీపీ యువజన ఉపాధ్యాక్షుడు బుట్టా ప్రతుల్,బసిరెడ్డి.పట్టణ అధ్యక్షుడు నాగేషప్ప,పట్టణ ఉపాధ్యాక్షుడు కొటకొండ నరసింహాలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కడిదొడ్డి గ్రామంలో మజ్జిగ బసవరాజు ఇంటి వద్ద అక్రమంగా 384 కర్నాటక మద్యం 90 ఎంఎల్ ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విక్సీ టెట్రా ప్యాకెట్లను స్వాదీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో పట్టుబడిన కర్ణాటక మద్యంను, కడిదొడ్డికి చెందిన మజ్జిగ బసవరాజుపై కేసు నమోదు చేసి రిమండ్‌కు తరలించామన్నారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ ఎస్‌ఐలు బి.కార్తిక్ సాగర్, కే.నాగేంద్ర, సిబ్బంది కిషోర్ కుమార్, మునిరంగడు, భరత్, రవికుమార్, తిక్కయ్య పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ హర్షణీయం

కోసిగి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు బడులు ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ పథకం కింద పాఠ్యపుస్తకాలు కిట్లను అందజేయడం హర్షణీయమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి అన్నారు. పార్టీ గుర్తులు, రంగులు లేకుండా సర్వేపల్లి రాధాకృష్ణ మిత్ర కిట్ల పేరుతో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, బెల్టులు, షూస్ అందజేయడం కూటమి ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్రాణి వెంకటేశ్, లక్ష్మీకాంత్, వెంకటేశ్, గోపాల్, కోసిగయ్య, రాజేష్, పీడీ ఖలీల్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న ఈరన్నస్వామి

కౌతాళం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం సోమవారం భక్తులతో సందడిగా మారింది. సోమవారం స్వామి వారం కావడంతో దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను తెల్లవారుజామునే శుద్ధజలంతో పూజించి ప్రత్యేక పుష్పాల తో అలంకరించి మహమంగళహారతితో పూజించి భక్తులకు దర్శనం కల్పించారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మరి కొంత మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. దర్శనంకు వచ్చిన భక్తులకు ఆలయ డిప్యూటీ కమీషనర్ విజయరాజు ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

దేవమ్మ అమ్మవారికి 2 కేజీల వెండి ఆభరణాలు



అమ్మవారిని అలంకరించిన దృశ్యం

మంత్రాలయం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో వెలసిన దేవమ్మ అమ్మవారికి గ్రామ ప్రజలు రెండు కేజీల వెండితో అందంగా తయారు చేసిన ముఖ కవచం, పంచ నాగభరణిని విరాళంగా ఇవ్వడంతో అమ్మవారిని అలంకరించి భక్తులు సమర్పించిన నైవేద్యాలతో పూజించారు. అమ్మవారిని చూడముచ్చటగా అలంకరించి పూజలు చేశారు. రాజకీయ పార్టీలకతీతంతగా అమ్మవారికి వెండి విరాళం ఇచ్చిన దాతల కుటుంబాల పేరు మీద అర్చనలు చేశారు.

శ్రీ మఠానికి బియ్యం విరాళం



ప్రహ్లాద జోషి కుటుంబ సభ్యులకు సంకల్పం చేస్తున్న అర్చకులు

మంత్రాలయం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి కేంద్రమంత్రి ప్రహ్లాద జోషి 25 కేజీల ఉన్న 108 బియ్యం బస్తాలను విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషిసురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్‌లు తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని లారీ ద్వారా తెచ్చిన బియ్యాన్ని విరాళం ఇచ్చిన కేంద్ర మంత్రి కుటుంబానికి అర్చకులు సంకల్పం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమఠం నార్త్‌జోన్ విచారణ కర్త శ్రీనివాస కస్బే, సీఆర్‌ఓ విజయేంద్ర ఆచార్, స్టోర్ ఇన్‌చార్జీ బద్రినాథ్, డీన్ రాఘవేంద్ర ఆచార్, జేపీ స్వామి, నరసింహ దేశాయ్, శ్రీపాధ ఆచార్‌లు పాల్గొన్నారు.

భవిత పాఠశాలపై ప్రత్యేక దృష్టి

మంత్రాలయం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన భవిత పాఠశాలలో విద్యార్థులను చేర్పించి వారికి విద్యాబుద్దులు నేర్పించి అభివృద్ధి చేయాలని ఎంఈవో రాగన్న అన్నారు. సోమవారం మంత్రాలయంలోని భవిత పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో టీచర్లు కళ్యాణి ఉన్నారు.

మహిళపై అత్యాచారయత్నం...?

కోసిగి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మానవత్వం మంటగలిచింది. సభ్యసమాజం తలదించుకునేలా ఓ మానవ మృగంగా ప్రవర్తించాడు. ఈ నెల 2వ తేదీన అర్ధరాత్రి కోసిగి ఆర్టీసీ బస్టాండులో నిద్రిస్తున్న ఓ మహిళపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు బస్టాండులో సంబంధించిన సీసీ పుటేజీ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దాదాపు 15 రోజుల క్రితమే ఈ ఘటన జరిగింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో బస్టాండు సీసీ పుటేజీ వీడియోలు వెలుగులోకి వచ్చాయి. బస్టాండులో నిద్రిస్తున్న మహిళను ఓ వ్యక్తి బలవంతంగా మోసుకుని వెళ్తున్న సీసీ పుటేజీ సోషల్ మీడియలో వీడియోలు వైరల్ అయ్యాయి. ఇదే విషయాన్ని కోసిగి ఎస్‌ఐ హనుమంతరెడ్డిని వివరణ కోరగా.. మహిళ పై అత్యాచారయత్నం ఘటనలో ఎవరూ కూడా పిర్యాదు చేయలేదని, విచారించి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఇచ్చిన హామీలను అమలు పరచండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నో పథకాలు ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని పథకాలను అమలు చేసి చూపాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే నివాసమైన రాంపురంలో వైసీపీ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆరోపించారు. చంద్రబాబు అంటేనే మోసం అని, వెన్నుపోటు పొడిచి పార్టీని అధికారంలోకి లాక్కున్నది ఎవరో అందరికి తెలుసునన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం మండల కన్వీనర్లు గురెడ్డి భీమిరెడ్డి, బెట్టన్నగౌడు, రామ్మోహన్ రెడ్డి, ప్రహ్లాదాచార్, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, మహంతేష్ స్వామి పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చలకు సిద్ధం: ప్రదీప్‌రెడ్డి

అభివృద్ధిపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ మూడు, నాలుగు పార్టీలు మారుస్తూ ప్రజలకు వెన్నుపోటు పొడుస్తూ అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. మాధవరం రామిరెడ్డి కుటుంబానికి జిల్లా స్థాయి గుర్తింపు తెచ్చించి రాంపురంరెడ్డి సోదరులు అని గుర్తించుకోవాలన్నారు. పురుషోత్తంరెడ్డి, భీమిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రఘురాం, గజేంద్ర రెడ్డి, శివరాం, నరసన్న, అమరేష్, జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పరిష్కార వేదికలో ముగ్గురే అధికారులు

పెద్దకడబూరు, జూన్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేదికను ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసి జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తారు. ప్రజలు, రైతులకు ఏవైనా సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. అయితే పెద్దకడుబూరు మండలంలో ఏర్పాటు చేసే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కేవలం ఒకరిద్దరు అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. దీంతో ప్రజలు, రైతులు తమ సమస్యలు ఇక్కడ పరిష్కారం కావులే.. అని జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్టీవోగా రఘునందన్

ఎమ్మిగనూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు సబ్‌ట్రెజరీ అధికారిగా రఘునందన్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారన బదిలీల్లో భాగంగా ఎమ్మిగనూరు ఎస్‌టీఓగా పనిచేస్తున్న ఎస్‌టీఓ రాజు నందికోట్కూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో డోన్‌లో పనిచేస్తున్న ఎస్‌టీఓ రఘనందన్ ఎమ్మిగనూరుకు వచ్చారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఎస్‌టీఓ రాజును సబ్బింది సన్మానించారు. అలాగే కొత్తగా బాధ్యతలు చేపట్టిన రఘునందన్‌ను కార్యాలయ సిబ్బంది, ఏపీఎన్‌జీఓ జాయింట్ సెక్రటరీ ప్రభు, ఏపీప్రభుత్వ పెన్షనర్ అసోషియేషన్ ఎమ్మిగనూరు అధ్యక్షకార్యదర్శులు ఏపీ వీరన్న, శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు.

కిటకిటలాడిన సర్వీసు సెంటర్లు



ప్రజలతో కిటకిటలాడుతున్న బీసీ పాయింటు

ఎమ్మిగనూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రకారం తల్లికి వందనం పథకాన్ని అమలు చేసింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పూర్తయిన సందర్భంగా అర్హులైన పిల్లల తల్లుల ఖాతాల్లోకి డబ్బు జమచేసింది. ఒక్కో ఇంట్లో ఆరు నుంచి ఇద్దరు వరకు ఉన్న పిల్లలకు తల్లికి వందనం వారి తల్లుల ఖాతాల్లో డబ్బు పడిపోయింది. దీంతో పిల్లల తల్లులు సోమవారం పట్టణంలోని పలు బ్యాంకుల్లో తమ ఖాతాలో తల్లికి వందనం డబ్బు పడిందా లేదా.. అని పరిశీలించుకోవటం కనిపించింది.